Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 264 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 3 - 6 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# సర్‌పై అవగాహన పెంచుకోండి... అప్రమత్తంగా ఉండండి

**- ప్రతీ ఓటు మ్యాపింగ్ చేయాలి... అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటర్ల జాబితాలో ఉండాలి - కూటమి పార్టీలను సమన్వయం చేసుకుంటూ సర్‌పై యాక్షన్ ప్లాన్ - సర్‌పై రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు శిక్షణ - రెండేళ్ల పాలనపై ఈ నెల 25 నుంచి 45 రోజుల పాటు సైకిళ్లపై ఇంటింటి ప్రచారం - చిన్న పామైనా విషం కక్కుతోంది... గొడ్డలి పార్టీని పెద్ద కర్రతో కొట్టాలి - డీఎస్సీ, నంద్యాల ఘటనల్లో అలెర్టుగా ఉండడంతో తోక ముడిచారు - ఓటర్ల జాబితాపైనా గొడ్డలి పార్టీ విషయంలో అప్రమత్తత అవసరం - నాకు అనుచరులు వద్దు...పార్టీకి నాయకులు కావాలి**

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియపై ప్రతీ ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని.. అప్రమత్తంగా ఉండాలని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం సర్‌పై జరిగిన రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌కు సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జోనల్ కో-ఆర్డినేటర్లు, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు, పార్టీ పరిశీలకులు, బీఎల్ఏలు ఈ రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. వీరికి సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల్లో ఓటర్ల జాబితాలను ఆధారం చేసుకుని వ్యూహాలు, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందని గుర్తు చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సర్ ప్రక్రియపై రాష్ట్రస్థాయి నేతలు మొదలుకుని.. గ్రామస్థాయి వరకు ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవడమే కాకుండా.. పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు మాట్లాడుతూ... "మహానాడును వర్చువల్‌గా అద్భుతంగా నిర్వహించుకున్నాం. రెండు రోజుల మహానాడుకు 24.50 లక్షల మంది హాజరయ్యారు. వర్చువల్‌గా మహానాడు ఈ స్థాయిలో నిర్వహించుకోవడం సాధ్యమా అనే అనుమానాలను పటాపంచలు చేస్తూ... సక్సెస్ చేసుకోగలిగాం. ఇప్పుడు పార్టీ యంత్రాంగంపై అతి పెద్ద కీలక బాధ్యత ఉంది. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సర్ ప్రక్రియ మొదలవుతోంది. ప్రతీ 20-25 ఏళ్లకోసారి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతుంది. 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని సర్ ప్రక్రియను చేపడుతున్నారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారు. ఈ రెండు సార్లు మ్యాపింగ్ జరిగేలోగా ఓట్ల చేరికలు పరిపూర్ణంగా పూర్తి కావాలి. అవసరమైతే మూడో సారి కూడా ఇళ్లకు వెళ్లి ఓట్ల పరిశీలన జరపాలి. బీఎల్ఓలతో పాటు.. మన పార్టీకి చెందిన బీఎల్ఏలు కూడా వెళ్లాలి. ాx=ను అందరూ సీరియస్‌గా తీసుకోవాలి... ఎలాంటి నిర్లక్ష్యమూ ఉండకూడదు. ఓట్లు నమోదు చేసుకోవడం ఓటర్ల బాధ్యత. ఓట్ల చేరికలపై ప్రజలకు అవగాహన కల్పించడం రాజకీయ పార్టీగా మన ప్రాథమిక బాధ్యత. ఏ ఎన్నికలకైనా ఓటర్ల జాబితా అనేది చాలా కీలకం. ఓటర్ల జాబితా ఆధారంగానే ఎన్నికల్లో వ్యూహాలు అమలు చేయగలం... ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం. పార్టీ బలంగా ఉంటే... ప్రభుత్వం మరింత బలంగా ఉంటుంది. సర్‌పై ప్రతీ రోజూ మానిటర్ చేస్తాం. మన ఓట్లు ఉన్నాయా..? లేవా..? అనేది నిరంతరం చూసుకోవాలి. ఏపీకి చెందిన స్థానికులు వివిధ రకాల కారణాలతో ఇతర ప్రాంతాలకు వెళ్తారు. వారి ఓట్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. వివిధ ప్రాంతాల్లో ఉన్న





వాళ్లు పెద్ద ఎత్తున వచ్చి ఓట్లేయడం వల్లే మొన్నటి ఎన్నికల్లో కూటమికి 164 సీట్లు వచ్చాయి."అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**కూటమి పార్టీల సమన్వయం ముఖ్యం**

"సర్ ప్రక్రియ పర్యవేక్షణలో కూటమి పార్టీలను కూడా సమన్వయం చేసుకుని వెళ్లాలి. ఎన్నికలప్పుడే మిత్రపక్షాలతో కలుస్తాం... మిగిలిన రోజుల్లో పట్టించుకోం అంటే కుదరదు. ప్రభుత్వంలోనే కాదు.. అన్ని కార్యక్రమాల్లోనూ జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకోవాలి. నా రాజకీయ చరిత్రలో 2024 ఎన్నికల్లో సాధించినటువంటి ఘన విజయం ఎప్పుడూ చూడలేదు. కొత్త వారికి టిక్కెట్లు ఇచ్చినా.. కూటమి పార్టీ అభ్యర్థి అనగానే ప్రజలు, కార్యకర్తలు ఓటేశారు. పార్టీల మధ్య సమన్వయానికి సర్ మొదటి టెస్ట్. చాలా మంది అనుచరులను కోరుకుంటారు... కానీ నేను నాయకులను కోరుకుంటాను. సమర్థవంతమైన నాయకత్వం ఉంటే పార్టీకి బలం పెరుగుతుంది. 2024 ఎన్నికల ముందు పట్టభద్రుల ఎమ్మెల్సీలు గెలిచాం. పూర్తిస్థాయిలో గ్రౌండ్ వర్క్.. టెక్నికల్ వర్క్ చేసి అద్భుత విజయాన్ని నాటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో చూపించాం. గ్రాడ్యుయేట్ల ఎన్నికల్లో ఒకప్పుడు పోటీ చేసేవాళ్లం కాదు. కానీ నాడు ఆ ఎన్నికల్లో పోటీ చేశాం.. గెలిచాం.. అదీ మన నెట్ వర్క్ గొప్పదనం. సర్ విషయంలోనూ అదే స్థాయిలో కష్టపడి పని చేయాలి. పార్టీలో వివిధ కీలక అంశాలపై చర్చలు జరగాలి.. కార్యకర్తలు చర్చల్లో భాగస్వామ్యం కావాలి. అధికార ఫలితాలు కార్యకర్తలకు అందించాలి. క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల మిత్రపక్షాలు ఉండకపోవచ్చు. అయినా వారిని కూడా కలుపుకుని వెళ్లాలి. 2024 ఎన్నికలకంటే ఎక్కువగా మిత్రపక్షాలతో పని చేయాలి. మిత్రధర్మాన్ని ప్రతి నేతా, ప్రతి కార్యకర్తా పాటించాల్సిందే. సర్‌పై మూడు పార్టీలతో త్వరలో కో-ఆర్డినేషన్ కమిటీ కూడా వేస్తాం. దీనికి సంబంధించి త్వరలో ఓ ఎన్డీఏ సమావేశం నిర్వహించుకుంటాం."అని టీడీపీ అధినేత వెల్లడించారు.

**సైకిల్ పవర్ చూపుదాం... ప్రజలకు చేరువవుదాం...**

"జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు ఇంటింటి ప్రచారం చేపట్టాలి. రెండేళ్లల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలి. 45 రోజుల్లో ఇంటింటి ప్రచారం చేపట్టాలి... పెద్ద ఎత్తున ప్రజల్లోకి వెళ్లాలి. ఈ ఇంటింటి ప్రచారంలో నేను కూడా పాల్గొంటాను. సైకిళ్ల మీద వెళ్లి ప్రజలను కలవాలి. వీలుంటే ఈ-సైకిళ్లపై ప్రచారం చేపట్టాలి. నేను కూడా సైకిల్ మీదే ప్రచారం చేస్తాను. ప్రధానిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారు.. నేను నాలుగోసారి సీఎంగా ఉన్నాను. ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వీటితో పాటు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సాధించిన ప్రగతిపై పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలి. టీడీపీ అందరికి చెందిన పార్టీ... తెలుగువాళ్ల పార్టీ. ప్రతీ వర్గాన్ని మనం ఓన్ చేసుకోవాలి. సోషల్ రీ-ఇంజనీరింగ్‌తో పదవులు, సీట్ల కేటాయింపులు చేశాం. నామినేటెడ్ పదవుల్లోనూ.. పార్టీ పదవుల్లోనూ సోషల్ రీ-ఇంజనీరింగ్ చేపడుతున్నాం. కార్యకర్తల సాధికారత గురించి ఆలోచించాలి... కార్యకర్తల సంక్షేమం కోసం ప్రత్యేక విభాగాన్ని టీడీపీ తప్ప ఏ పార్టీ పెట్టలేదు. చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటున్నాం. చనిపోయిన కార్యకర్తలకు రూ. 5 లక్షల ప్రమాద బీమా ఇస్తున్నాం... పిల్లల చదువుకు ప్రత్యేకంగా స్కూల్ ఏర్పాటు చేశాం. కార్యకర్తల పిల్లలకు నైపుణ్య శిక్షణ ఇచ్చి మంచి ఉద్యోగాలకు సిఫార్సులు చేస్తున్నాం. కార్యకర్తల ఆర్థిక సాధికారత కోసం ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్ పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రతీ కార్యకర్త ఆరోగ్యంగా ఉండడానికి ఎంతైనా ఖర్చు చేస్తాం. మన కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ చర్యలు తీసుకుంటుంది... అలాగే ప్రతీ నాయకుడు ఇదే విధంగా ఆలోచన చేయాలి. మనకు తెలిసి కానీ తెలియకుండా కానీ తప్పులు జరగకూడదు.. అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకోవాలి. గత ప్రభుత్వంలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పోయిన బ్రాండ్‌ను మళ్లీ తెచ్చాం. పోలవరం ప్రాజెక్టు ఆగిపోతుందని అందరూ భయపడ్డారు.. కానీ మళ్లీ ప్రాజెక్టును ట్రాక్‌లో పెట్టాం. సంక్షేమం అందిస్తున్నాం... అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం. ఈ నెల 21వ తేదీన యోగా డేను అమరావతిలో 25 వేల మందితో నిర్వహిస్తాం. యోగా మన జీవన విధానంలో భాగం కావాలి."అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగలొద్దు...**

"చిన్న పామైనా పెద్ద కర్రతో కొట్టాలి... గొడ్డలి పార్టీ విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఎన్నికల్లో హామీ ఇచ్చి.. మొదటి సంతకం పెట్టి మెగా డీఎస్సీ నిర్వహించాం. మెగా డీఎస్సీ జరగకూడదని 241 కేసులు వేసి అడ్డుకున్నారు. కానీ వాటిని ఎదుర్కొని అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి.. నియామకాలు పూర్తి చేశాం. పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. గట్టిగా కౌంటర్లు ఇస్తే.. ఇప్పుడు తోకముడిచారు. నంద్యాలలో ఓ వైసీపీ కార్యకర్తే వైఎస్ విగ్రహం తల తీసేశారు.. పోలీసులు నిమిషాల్లో పట్టుకున్నారు. వైసీపీ కార్యకర్తను గుర్తించకుంటే టీడీపీపై నెపం నెట్టేవారు. వివేకా హత్య అనేది ఓ కేస్ స్టడీ. చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి... లేకుంటే విషం చిమ్ముతుంది... దీన్ని ప్రతీ ఒక్కరూ నిరంతరం గుర్తు పెట్టుకోవాలి. గొడ్డలి పార్టీతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. నేను ఎన్నో పోరాటాలు చేశాను.. కానీ నీచులతో ఎప్పుడూ పోరాటాలు చేయలేదు. పార్టీ పెట్టినప్పటి నుంచి హిందూపురం, కుప్పం సహా ఇంకొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ గెలుస్తూనే ఉంది... ఇలాంటి నియోజకవర్గాల సంఖ్య పెరగాలి. కొత్తగా ఎమ్మెల్యేలు అయిన వారు వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదు... మళ్లీ మళ్లీ గెలవాలి. అభివృద్ధి, సుపరిపాలన ద్వారా ఓట్లు పడతాయి. ప్రజా ప్రతినిధుల వ్యవహార శైలి ద్వారా ఓట్లు పెరుగుతాయి.. తగ్గుతాయి. ప్రజల కోసం పని చేసినా నోరు అదుపులో పెట్టుకోకుంటే నష్టమే జరుగుతుంది. కార్యకర్త మొదలుకుని నాయకుడి వరకు ప్రతి ఒక్కరికీ క్యారెక్టర్, ట్రస్ట్ అనేది చాలా ముఖ్యం."అని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఎస్సీ, ఎస్టీలకు ఉచిత ఉపాధి శిక్షణ

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం కంచరపాలెం బాలికల ఐటిఐ ప్రాంగణంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో జూలై ఒకటో తేదీ నుండి ప్రరంభంకానున్న 2026-27 ఉచిత కోర్సులకు ఎస్సీ, ఎస్టీ చెందిన అభ్యర్థుల నుండి మరియు శిక్షణ సంస్థల (స్పెషల్ కోచింగ్ స్కీమ్ మాత్రమే) నుండి ధరఖాస్తులను స్వీకరించబడును. కేంద్ర ప్రభుత్వ ఉపాధి, లేబర్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో స్పెషల్ కోచింగ్ స్కీమ్ (కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు), ఓ లెవెల్ కంప్యూటర్ సాఫ్ట్ వేయర్, ఓ లెవెల్ కంప్యూటర్ హార్డ్ వేయర్ కోర్స్‌లలో ఈ శిక్షణను ఏడాది పాటు ఉచితంగా అందించబడును. శిక్షణ కాలంలో, ఎంపికైన వారికి నెలకి రూ. వెయ్యి స్టైఫండ్ అందించబడును. మరో కోర్సు ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ఫౌండేషన్ టెక్నాలజీ (2 నెలలు) కూడా శిక్షణ ఇవ్వబడును. ఆశక్తి, అర్హత గల వారు దరఖాస్తులను ఆన్ లైన్ ద్వారా https://dbtscst.ncs.gov.in/users/signup 5 NCSC రుజువు పత్రాలతో అప్లై చేయవలను. అభ్యర్థులు కనీసం ఇంటర్మీడియట్ / 10+2 చదివి యుండవలను. కుటుంబ ఆదాయం మూడు లక్షలు మించరాదు. వయసు జూలై ఒకటో తేదీకి 18 నుండి 27 (స్పెషల్ కోచింగి స్కీమ్), 18 నుండి 30 (ఓ లెవెల్, AI) ఉండవలను. జూన్ 10న ధరఖాస్తు ఆఖరు తేదీ. పూర్తి వివరముల కొరకు వెంటనే 0891-2788700, https://dge.gov.in లేదా ncsc.vizag/facebook.https://ncs.gov.in లేదా సందర్శించవలెను.

## రూ. 5 లక్షలు చెక్కును అందచేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**బుచ్చి /కోవూరు, (రాజధాని వార్తలు):** ఇటీవల బస్సు దగ్ధం కేసులో బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ 18వ వార్డుకు చెందిన కత్తి జయరామయ్య మృతి చెందిన కారణంగా, వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కారణంగా ప్రభుత్వం మంజూరు చేసిన వచ్చినటువంటి 5 లక్షల రూపాయల చెక్కును కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చేతులు మీదుగా వారి కుటుంబ సభ్యులకు చెక్కును ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి వైస్ చైర్మన్ యరటపల్లి వెంకట శివకుమార్ రెడ్డి, ఎమ్మార్వో అంబటి వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శాంతి ప్రియ, స్థానిక టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## న్యూఢిల్లీలోని ఏపీఐసీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలను స్వీకరించిన తెల్ల కస్తూరి

**(రాజధాని వార్తలు):** ఒంగోలు జోన్-3 ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న తెల్ల కస్తూరి సోమవారం సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనరేట్‌లో న్యూఢిల్లీలోని ఏపీఐసీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. సమాచార పౌర సంబంధాల శాఖలో అడిషనల్ డైరెక్టర్ (ఇంచార్జ్)గా విధులు నిర్వహిస్తూ, న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఏపీఐసీ) ప్రత్యేక అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించిన పి. కిరణ్ కుమార్ ఈ నెల 31న పదవీ విరమణ చేసిన నేపథ్యంలో తెల్ల కస్తూరికి బాధ్యతలు అప్పగించారు. ఏపీఐసీ ప్రత్యేక అధికారి బాధ్యతలను ఒంగోలు జోన్-3 ప్రాంతీయ సంయుక్త సంచాలకులు తెల్ల కస్తూరికి అప్పగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్.విశ్వనాథన్ ఉత్తర్వులు జారీ చేసారు. సంచాలకులు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు తెల్ల కస్తూరి న్యూఢిల్లీలోని ఏపీఐసీ ప్రత్యేక అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం న్యూఢిల్లీలోని ఏపీఐసీ ప్రత్యేక అధికారి, ఒంగోలు జోన్-3 ప్రాంతీయ సంయుక్త సంచాలకులు తెల్ల కస్తూరి సమాచార పౌర సంబంధాల సంచాలకులు కేఎస్ విశ్వనాథన్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు.

**సుదీర్ఘ సర్వీస్ ప్రస్థానం**

21 డిసెంబర్ 2001 నాడు, ఏపీపీఎస్సీ ద్వారా జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారిగా రంగారెడ్డి జిల్లాలో నియమితులయ్యారు. తదనంతరం డిపిఆర్ఓగా హైదరాబాద్ జిల్లాలో ఆమె సేవలు అందించారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రమోషన్ పొందిన తర్వాత ఉమ్మడి రాష్ట్ర పబ్లిసిటీ సెల్‌లో బాధ్యతలు నిర్వహించి, ప్రధమ



మహిళా సిపిఆర్ఓ టూ డిజిపిగా బాధ్యతలు చేపట్టి, సమర్థవంతంగా పనిచేశారు. అనంతరం ప్రధమ మహిళ సిపిఆర్ఓ టూ జిహెచ్ఎంసిగా సేవలందించారు. రాష్ట్ర విభజన అనంతరం తన మాతృ సంస్థ అయిన సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ఆంధ్రప్రదేశ్ కు కేటాయించబడి డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. డిప్యూటీ డైరెక్టర్ గా పబ్లిసిటీ సెల్ నందు, మీడియా రిలేషన్స్‌లో, అడ్మినిస్ట్రేషన్‌లో తన సేవలు అందించారు. 2019లో జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది అడ్మినిస్ట్రేషన్, మీడియా రిలేషన్స్, ప్రింట్ మీడియా అడ్వర్టైజ్మెంట్ శాఖలను సమర్థవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం ఆర్జెడి-3 ఒంగోలుగా గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, మార్కాపురం జిల్లాల బాధ్యతలను ఆమె నిర్వహిస్తున్నారు. తన 24 ఏళ్ల సర్వీస్‌లో దాదాపు 25 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల దగ్గర పనిచేసి ఉత్తమ అధికారిగా మన్ననలు పొందారు.




# భగవాన్ బుద్ధుడి ప్రధాన శిష్యుల పవిత్ర అవశేషాలు మంగోలియాకు చేరుకున్నాయి, శ్రద్ధా భక్తులతో ఘన స్వాగతం

## - గాందన్ మఠంలో జూన్ 9 వరకు బహిరంగ దర్శనం, రాష్ట్ర బౌద్ధ పర్యాటక ప్రదేశాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది






**(రాజధాని వార్తలు):** అస్సాం గౌరవ గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య భగవాన్ బుద్ధుడి ఇద్దరు ప్రధాన శిష్యులైన అర్హత్ సారిపుత్ర, అర్హత్ మహామౌద్గల్యాయనుల పవిత్ర అవశేషాలను భారత వైమానిక దళ ప్రత్యేక విమానంలో మంగోలియాకు తీసుకెళ్లారు. మంగోలియా చేరుకున్నప్పుడు విమానాశ్రయంలో దేశ విద్యాశాఖ మంత్రి ఎల్.ఎంఖ్-అమగలాన్, గాందన్‌తెగ్చెన్ లింగ్ మఠం ప్రధాన మహంత్ ఖాంబా నోమున్ ఖాన్ గేశే ల్హారంపా డి.జావ్‌జాన్‌దోర్జ్ శ్రద్ధతో స్వాగతించారు. పవిత్ర అవశేషాల ప్రయాణ మార్గంలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై భక్తిభావంతో నమస్కరించి తమ ఆస్తను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆచార్యతో పాటు అదనపు ప్రధాన కార్యదర్శి సాంస్కృతిక, మతపరమైన ట్రస్ట్‌లు, ధర్మస్వం, సాధారణ పరిపాలన శివ శేఖర్ శుక్లా, భారత ప్రభుత్వం, మధ్యప్రదేశ్ ప్రభుత్వం, అంతర్జాతీయ బౌద్ధ సంఘం, భారత్, శ్రీలంకలకు చెందిన సీనియర్ బౌద్ధ భిక్షువులతో కూడిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం కూడా హాజరైంది. ఈ కార్యక్రమంలో మంగోలియాలోని వివిధ ప్రధాన మఠాల మహంత్‌లు, అనేక మంది బౌద్ధ భిక్షువులు, మంగోలియా మాజీ మూడవ అధ్యక్షుడు నాంబారిన్ ఎంఖ్‌బయార్ కూడా ప్రత్యేకంగా పాల్గొన్నారు.

**గాందన్ మఠంలో ఈ పవిత్ర అవశేషాల ప్రదర్శన 2026 జూన్ 9 వరకు**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవతో సాంచి స్థూపంలో భద్రపరచిన భగవాన్ బుద్ధుడి ప్రధాన శిష్యులైన అర్హత్ సారిపుత్ర, అర్హత్ మహామౌద్గల్యాయనుల పవిత్ర అవశేషాలను బహిరంగ దర్శనం కోసం మంగోలియాకు పంపారు. గాందన్ మఠంలో ఈ పవిత్ర అవశేషాల ప్రదర్శన 2026 జూన్ 9 వరకు జరుగుతుంది, దీనివల్ల వేలాది మంది భక్తులకు దర్శన భాగ్యం లభిస్తుంది. ఈ చొరవ కేవలం ఆధ్యాత్మిక ప్రాముఖ్యతకు మాత్రమే పరిమితం కాదు, భారత్, మంగోలియా మధ్య సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు పర్యాటకం, సాంస్కృతిక మార్పిడికి కొత్త దిశను అందిస్తుంది.

**రాష్ట్ర బౌద్ధ పర్యాటక ప్రదేశాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది**

ఈ చారిత్రక చొరవతో భారత బౌద్ధ తీర్థ సర్క్యూట్, ముఖ్యంగా సాంచి వంటి ప్రపంచ ప్రసిద్ధ ప్రదేశాల పట్ల అంతర్జాతీయ ఆకర్షణ పెరుగుతుంది. మధ్యప్రదేశ్‌కు కూడా ఇది ముఖ్యమైన అవకాశం, దీనివల్ల రాష్ట్ర బౌద్ధ పర్యాటక ప్రదేశాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది, విదేశీ పర్యాటకుల సంఖ్య, బస కాలం, సాంస్కృతిక భాగస్వామ్యం పెరుగుతాయి. అదే సమయంలో ఈ చొరవ రెండు దేశాల మఠాలు, సాంస్కృతిక సంస్థలు, సంగ్రహాలయాల మధ్య దీర్ఘకాలిక సహకారానికి కొత్త దారులు తెరుస్తుంది. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన సాంచి స్థూపం ప్రపంచంలోనే అత్యంత పురాతన, ముఖ్యమైన బౌద్ధ ప్రదేశాలలో ఒకటి. ఇక్కడ భద్రపరచిన పవిత్ర అవశేషాలను భగవాన్ బుద్ధుడికి ప్రతీకగా అత్యంత శ్రద్ధ, పూజ్యభావంతో చూస్తారు. భగవాన్ బుద్ధుడి ఇద్దరు ప్రధాన శిష్యులైన సారిపుత్ర, మహామౌద్గల్యాయనులను బౌద్ధ సంఘంలో 'అగ్ర జంట'గా పరిగణిస్తారు. సారిపుత్ర ప్రజ్ఞ, జ్ఞానానికి ప్రసిద్ధి, మహామౌద్గల్యాయనుడు ఆధ్యాత్మిక, అలౌకిక సిద్ధులకు ప్రసిద్ధుడు. ఇద్దరూ బౌద్ధ ధర్మ ప్రచారంలో అమూల్య సేవ చేశారు, వారి బోధనలు నేటికీ బౌద్ధ దర్శనం, సాధనా సంప్రదాయానికి ముఖ్యమైన ఆధారం.

# కోర్టు కేసులో ఉంటే పట్టాదారు పాసు పుస్తకాలు ఎలా ఇచ్చారు : ఎం.జె.లక్ష్మి ప్రసన్న






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరం లోని స్థానిక ప్రెస్ క్లబ్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో నెల్లూరు వాస్తవ్యులు తమిళనాడులోని చెన్నైలో నివసిస్తున్న ఎంజే లక్ష్మీ ప్రసన్న విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మా వారసత్వపు ఆస్తి 1940 సంవత్సరంలో మా నానమ్మ కొనుగోలు చేశారని అటుపిమ్మట 1974లో వారి వీలునామాలో వారి వారసులకు రిజిస్టర్డ్ వీలునామా ఏర్పాటు చేశారు. తదనంతరం వారసత్వపు హక్కుగా నాకు, నా చెల్లెలు అయినటువంటి మధుమతికి ఇద్దరికీ కలిపి ఒక్క ఎకరా 94 సెంట్లు, ఇవ్వగా, సదరు భూమిని మా తండ్రి వారికి విక్రయించినట్లుగా పత్రాలు సృష్టించి, నకిలీ ఆర్ఓఆర్ సృష్టించి, రెవెన్యూ రికార్డులలో తారుమారు చేయడంతో మేము నాలుగవ అదనపు జ్యుడిషియల్ మ్యాజిస్ట్రేట్ కోర్టు నందు CC.NO.266/24, క్రింద క్రిమినల్ కేసు, ఐదవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో ఓఎస్ నెంబర్ 213/2018 క్రింద విచారణ జరుగుతున్నదని కానీ సదరు వ్యక్తులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై పట్టాదారు పాసు పుస్తకాలను పొందారని, అధికారులు కోర్టులో ఉన్న కేసు పై అత్యంత వేగంగా పాసుపుస్తకాలు అందజేయడం ఏ విధంగా సాధ్యమైందో అర్థం కాలేదని అధికారులు విచారించి సదరు భూమి యొక్క నకిలీ ఆర్ఓఆర్‌ను రద్దు చేసి నా పేరు మీద మార్పు చేసి పట్టాదారు పాసు పుస్తకం నా పేరు మీద చేయవలసిందిగా రెవెన్యూ అధికారులకు ఆ విజ్ఞప్తి చేశారు.

# అమరావతిలో వాగుల పనులు వేగవంతం చేయండి

## - ఏడీసీ సీఎండీ డి.లక్ష్మీపార్థసారథి ఆదేశాలు





**అమరావతి, (రాజధాని వార్తలు):** వర్షాకాలం సమీపిస్తున్నందున రాజధాని అమరావతిలో వరద ముందు నియంత్రణ పనులను శరవేగంగా చేపట్టాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి డి.లక్ష్మీపార్థసారథి వారు అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతిలో జరుగుతున్న కొండవీటివాగు, పాలవాగు అభివృద్ధి పనులను ఆమె తనిఖీ చేశారు. అమరావతిలోని ఎన్-4, ఎన్-6(వెస్ట్ బైపాస్), ఈ-10, ఈ -12 రహదార్లను దాటుకుంటూ వెళుతున్న వంతెన నిర్మాణాలను పరిశీలించారు. ఈ రహదార్ల వెంట కొండవీటివాగు, పాలవాగులు దాటుకొని కృష్ణానదిలో కలుస్తున్నాయి. వంతెనల పిల్లర్ల వద్ద మట్టి పేరుకుపోకుండా తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా అమృత విశ్వ విద్యాలయానికి సమీపంలో కొండవీటివాగు పశ్చిమ బైపాస్‌ను క్రాస్ చేసే ప్రదేశంలో బ్రిడ్జిలను పరిశీలించారు. వర్షాలు కురిస్తే ఇక్కడ వాగునీరు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున ఇక్కడి పరిస్థితి ఏడీసీ ఛీఫ్ ఇంజినీరు బి.నరసింహమూర్తి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ-10, ఈ - 11 మధ్య కొండవీటి వాగు పై వెస్ట్ బైపాస్ బ్రిడ్జి కింద పిల్లర్ల కింద మట్టి తొలగింపు పనులు ముమ్మరం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జేసీబీ యంత్రాలను పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసి మట్టిని తొలగించసిందిగా చీఫ్ ఇంజనీర్ బి.నరసింహమూర్తిని ఆదేశించారు. ఎయిమ్స్ ఆస్పత్రి వద్ద జరుగుతున్న ఈ-13, మంగళగిరి టౌన్‌లో జరుగుతున్న ఈ - 15 రహదార్ల పొడిగింపు పనులను పరిశీలించారు. ఈ పర్యటనలో ఏడీసీ సూపరింటెండింగ్ ఇంజినీర్లు కె.రామమోహనరావు, వి.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.బసవేశ్వరరావు, వి.పద్మాకరప్రసాద్, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద కూటమి నాయకులు సంబరాలు





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభమైన సందర్భంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకొన్నారు. సోమవారం దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద ఘనంగా విజయోత్సవాలు నిర్వహించారు. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల ఆకాంక్ష సాకారమైన సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సంబరాల్లో పాల్గొన్నారు. బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచి ఆనందాన్ని వ్యక్తం చేశారు. రైల్వే ఉద్యోగులు, ప్రయాణికులు సైతం ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల నాలుగు దశాబ్దాల కల నేడు సాకారమైందన్నారు.

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో ప్రాంత అభివృద్ధికి కొత్త అధ్యాయం ప్రారంభమైందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కృషి ఫలితంగానే ఈ చారిత్రక ఘట్టం సాధ్యమైందని అన్నారు.

**యువతకు కొత్త అవకాశాలు**

రైల్వే జోన్ ఏర్పాటుతో స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పల్లా తెలిపారు. రైల్వే నియామకాలు, పరిపాలనా వ్యవహారాలు స్థానిక స్థాయిలో మరింత సులభతరం అవుతాయని చెప్పారు. ఉత్తరాంధ్ర యువత భవిష్యత్తుకు ఇది బలమైన పునాది అవుతుందని అభిప్రాయపడ్డారు.

**పోర్టు ఆధారిత అభివృద్ధికి ఊతం**

విశాఖపట్నం, గంగవరం పోర్టులతో రైల్వే అనుసంధానం మరింత బలోపేతం కావడం ద్వారా సరకు రవాణా సామర్థ్యం పెరుగుతుందని పల్లా పేర్కొన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు, వాణిజ్య కార్యకలాపాలకు ఇది విశేష ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. రైల్వే జోన్ ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధికి కీలక కేంద్రంగా మారనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, గాజువాక బీజేపీ కన్వీనర్ నరసింగరావు, కూటమి నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కరప మండలంలో తాగునీటి కోసం ప్రజల అవస్థలు

## - మట్టి దందాలో బిజీగా నాయకులు, అధికారులపై గ్రామస్తుల ఆగ్రహం

**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ కరప మండలంలో ప్రజలు స్వచ్ఛమైన తాగినీరు కోసం తీవ్ర అవస్థలు. ముఖ్యంగా జెడ్. భావారం శివారు ప్రాంతాల ప్రజలు తాగునీటి సమస్యతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో తాగేందుకు స్వచ్ఛమైన నీరు అందక ప్రజలు అవస్థలు ఎదు ర్కొంటున్నారు. స్థానికుల కథనం ప్రకారం, వారానికి ఒకసారి మాత్రమే కొళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతుండగా, ఆ నీరు కూడా రంగు మారి దుర్వా సనతో వస్తోందని తెలిపారు. ఆ నీరు తాగడానికి పనికిరాకపోవడంతో కుటుంబాల అవసరాల కోసం ఫిల్టర్ వాటర్‌పై ఆధారపడాల్సి వస్తోందన్నారు. రూ.10 చొప్పున వాటర్ టిన్లు కొనుగోలు చేసి, దాదాపు కిలో మీటరు దూరం నుంచి తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ నీరు తాగిన తర్వాత కూడా ఆరోగ్య సమస్యలు, ముఖ్యంగా కీళ్ల నొప్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి కొళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పలు సందర్భాల్లో హామీ ఇచ్చినప్పటికీ తమ ప్రాంతంలో పరిస్థితి మాత్రం మారలేదని గ్రామస్తులు వాపోయారు. తాగునీటి సమస్యపై పలుమార్లు స్థానిక నాయకులు, పంచాయతీ అధికారులకు తెలియజేసిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం వేసవి ఎండలు తీవ్రస్థాయిలో ఉండటంతో నీటి కొరత మరింత పెరిగిందని, చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరోవైపు ప్రజా సమ స్యలను పరిష్కరించాల్సిన నాయకులు, అధికారులు మట్టి అక్రమ రవాణా వ్యవహారాల్లోనే నిమగ్నమై ఉన్నారని గ్రామస్తులు విమర్శించారు. జెడ్.భావారం, గొడ్డటిపాలెం శివారు ప్రాంతాలకు తక్షణమే స్వచ్ఛమైన తాగునీటి సరఫరా ఏర్పాటు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# కలెక్టర్ హిమాన్షు శుక్ల చేతులు మీదుగా కారుణ్య నియామకాలు








**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వివిధ శాఖలలో విధులు నిర్వహిస్తూ అసువులు బాసిన ఉద్యోగస్తుల కుటుంబాలకు సోమవారం నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కారుణ్య నియామక ఉత్తర్వులను కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో అందజేశారు. 1. ఆర్టీసీలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన కే.బాలయ్య కుమారుడు కే.వెంకట వర్మను డిజిటల్ అసిస్టెంట్‌గా పంచాయతీరాజ్ శాఖ కేటాయిస్తూ కారుణ్య నియామక పత్రాలను జిల్లా కలెక్టర్ అందజేశారు. 2. ఏపీఎస్ఆర్టీసీలో విధులు నిర్వహిస్తూ అసువులు బాసిన కే.వెంకట సుబ్బరాజు కుమారుడు కే. మహేష్‌కు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2గా, ఉద్యోగ వసతి కల్పిస్తూ కారుణ్య నియామకం పత్రాలను అందజేశారు. 3. ఏపీఎస్ఆర్టీసీలో డ్రైవర్గా విధులు నిర్వహిస్తూ మరణించిన ఆర్.మనీ కుమారుడు ఆర్. కిరణ్‌కు వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా, సాంఘిక సంక్షేమ శాఖకు కేటాయిస్తూ కారుణ్య నియామక ఉత్తరులను అందజేశారు. 4. కావలి ఏరియా ఆసుపత్రిలో ఎఫ్ఎన్ఓగా విధులు నిర్వహిస్తూ మరణించిన సిహెచ్.మరియమ్మ కుమారుడు జి.ప్రమోద్‌కు ఆఫీస్ అబార్డినేటుగా నియమిస్తూ పశుసంవర్ధక శాఖకు కేటాయిస్తూ సంబంధిత కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. 5. జిల్లా వైద్య శాఖ అధికారి కార్యాలయంలో ఎం ఓ హెచ్ ఎస్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన పెంచలరావు భార్య వై.చంద్రకళకు ఆఫీసు సబార్డినేటుగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు కేటాయిస్తూ కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. 6. కావాలి అగ్నిమాపక శాఖలో ఫైర్ మాన్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన ఎం.సుధాకర్ రావు కుమార్తె ఎం.మాధురికి జూనియర్ అసిస్టెంట్‌గా హెల్త్, మెడికల్ అండ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. కారుణ్య నియామక పత్రాలను సంబంధిత వారికి అందించిన తదుపరి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలను పై అధికారుల సూచన మేరకు సక్రమంగా నిర్వహిస్తూ ఆయా శాఖల అభ్యున్నతికి సహకరించడంతో పాటు కుటుంబ విలువలను కాపాడుతూ జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు.


# గండవరంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన వేమిరెడ్డి పట్టాభి

**కొడవలూరు, (రాజధాని వార్తలు):** కొడవలూరు మండలం గండవరం గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అర్హులైన లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు మరియు ఇతర అర్హుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుంటోందని అన్నారు. ప్రతి నెలా ఇంటి వద్దకే పెన్షన్ అందించడం ద్వారా లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం అనే రెండు కళ్లతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పారు. గ్రామీణ



ప్రాంతాల అభివృద్ధితో పాటు పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది. స్థానిక టీడీపీ కూటమి నేతలు తదితరులు ఉన్నారు. తన సొంత ఊరు గండవరములో పింఛనలను పంపిణీ చెయ్యడం తనకు ఎంతో తృప్తిని ఇచ్చిందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేసారు.

# కత్తి కుటుంబానికి రూ. 5 లక్షలు చెక్కును అందచేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి



**బుచ్చి /కోవూరు, (రాజధాని వార్తలు):** ఇటీవల బస్సు దగ్ధం కేసులో బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ 18వ వార్డుకు చెందిన కత్తి జయ రామయ్య మృతి చెందిన కారణంగా, వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కారణంగా ప్రభుత్వం మంజూరు చేసిన వచ్చినటువంటి 5 లక్షల రూపాయల చెక్కును కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చేతులు మీదుగా వారి కుటుంబ సభ్యులకు చెక్కును ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి వైస్ చైర్మన్ యరటపల్లి వెంకట శివకుమార్ రెడ్డి, ఎమ్మార్వో అంబటి వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శాంతి ప్రియ, స్థానిక టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న వారిని ఓడించి తనకు పట్టం కట్టిన ప్రజలను మరిచిపోను : ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు నియోజకవర్గం లోమహిళా ఎమ్మెల్యే తనకు పట్టం కట్టిన ప్రజలను తాను ఎన్నటికీ మరిచిపోనని స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరులో 6సార్లు ఎమ్మెల్యేగా ఉన్నవారిని కాదని మంచిని అర్థం చేసుకొని కోవూరు పీఠాన్నీ అప్పగించినందుకు తనను ప్రజలు తరపున అసెంబ్లీకి పంపి కోవూరు నియోజకవర్గం వాణిని వినిపించినందుకు తన కొరకు కష్టం చేసిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కోవూరు నియోజకవర్గం తిరుగులేని నాయకురాలుగా ప్రశాంతి రెడ్డి ఉన్నారు. ప్రతి పని ముక్తకంఠంతో విని సమస్యలు పరిష్కారం చేస్తూ మరోవైపు టీడీపీ పార్టీని బలోపేతం చేస్తూ గ్రామ స్థాయి నుండి కోవూరు నియోజకవర్గం స్థాయి నుండి మంగళగిరి అధిష్టానం నేతలు వద్ద సూపర్ అనిపించుకొన్న ఏకైక ఎమ్మెల్యేగా ప్రశాంతి రెడ్డికే దక్కిందని చెప్పవచ్చు. ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని మంచికి చోటు ఇస్తూ ప్రజలు కొరకే పని చేసే చిత్తశుద్ధి కలిగిన ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికే సాధ్యం అయిందని భావించాలి. ఈ రోజుల్లో గెలిస్తే చాలు అనుకొనే పరిస్థితిని పక్కనపెట్టి ప్రతి అర్జీపై సుదీర్ఘ దృష్టి సారించి అందరికీ పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకొని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ముందుకు సాగుతున్నారు. తన నష్టపోయిన



పర్వాలేదు అనుకొనే తత్వం వేమిరెడ్డి పుణ్యదంపతులుకే సాధ్యంతోనే ఆర్థిక సాయం సహకారాలు అందిస్తూ ప్రజల నుండి మన్నలను పొందుతున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి కోవూరు విజయోత్సవ సభలో ప్రతి టీడీపీ నేత ఆమెకు అపూర్వ స్వాగతం పలికారు.

# దివ్యాంగులకు న్యాయం చేయండి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** దివ్యాంగులకు న్యాయం చెయ్యాలని కోరుతూ సోమవారం కలెక్టర్ ప్రాంగణంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల రోజున వైఎస్ఆర్‌సిపి దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కలెక్టర్‌కి నూతనంగా ఏర్పడిన జిల్లాలలో దివ్యాంగుల సంక్షేమ శాఖ, వయోవృద్ధుల, హిజ్రాల కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని దివ్యాంగుల సంఘం నేత ఆవుల నాగేంద్ర అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సిపి దివ్యాంగుల విభాగం నెల్లూరు జిల్లా అధ్యక్షులు చెల్లా మోహన్ మాట్లాడుతూ 21 రకాల వైకల్యాలు గల వ్యక్తులు, వయోవృద్ధులు, హిజ్రాలు దివ్యాంగుల కార్యాలయంలోని సమాచారం తెలియక తమ హక్కులు, అవకాశాలను చేజార్చుకుంటూ నిరాశ నిస్పృహలతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్సార్సీపీ దివ్యాంగుల విభాగం నెల్లూరు నగర అధ్యక్షులు ఎస్.కె.సుభాన్ భాష మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాలు వ్యక్తిగత సమస్యలను స్వయంగా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి తమ గోడును వెళ్లబుచ్చుకుంటే కొంత ఉపశమనంగా ఉంటుందని, రూరల్ నియోజకవర్గం అధ్యక్షులు పెంచల్ రెడ్డి మాట్లాడుతూ వివిధ రకాల ఉపకరణాలు పొందాలంటే తీవ్ర వైకల్యం వల్ల, వయోవృద్ధులు వయస్సు రీత్యా ఆరోగ్యం సహకరించక ఆర్థిక ఇబ్బందుల వలన పొందలేక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్సార్సీపీ దివ్యాంగుల విభాగం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల నాగేంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 2 సం. పూర్తి అయినా కూడా దివ్యాంగుల సమాజాన్ని గాలికి వదిలేసి విద్య, వైద్యం, ఉపాధి, రక్షణ, 2016 దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ, మెగా డిఎస్సీ ఉద్యోగాల భర్తీలలో దివ్యాంగులకు మొండి చేయి చూపించి అన్ని రకాల సంక్షేమ పథకాలకు తూట్లు పొడుస్తూ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం మీ అసమర్థత



పాలనకు నిలువెత్తు నిదర్శనంగా భావిస్తున్నామని నాగేంద్ర అన్నారు. లోకేష్ చెప్పే జాబ్ క్యాలెండర్‌లో దివ్యాంగుల ఉద్యోగాల వాటాను స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తూ, దివ్యాంగుల సమాజం మీద చిత్తశుద్ధి ఉంటే మంత్రి, డోలా బాల వీరాంజనేయ స్వామి తక్షణమే స్పందించి దివ్యాంగుల సంక్షేమం మీద సమీక్ష సమావేశం నిర్వహించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన బడ్జెట్లలో దివ్యాంగులకు కేటాయించిన బడ్జెట్ వాటా ఎంతో స్పష్టం చేయాలని కోరుతూ సమస్యల పరిష్కారానికై చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తూ, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణస్వామి మీరు తమ విధిగా భావించి అన్ని జిల్లాలలో దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాలను ఫ్రెండ్లీ టాయిలెట్స్, ర్యాంపులు, పిడబ్ల్యూడి వెబ్‌సైట్‌ను, టోల్ ఫ్రీ నెంబర్‌ను అనుకూల మౌలిక వసతులతో జిల్లాల వారీగా దివ్యాంగుల కార్యాలయంలో సిబ్బంది కొరత లేకుండా ఏర్పాటు చేయుటకు విధిగా కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము. లేనిపక్షంలో వైఎస్ఆర్‌సిపి దివ్యాంగుల విభాగం రాష్ట్ర వ్యాప్తంగా మా పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అనుమతితో మరో దివ్యాంగుల ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గం అధ్యక్షులు షబ్బీర్, రామకృష్ణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# విపిఆర్ నేత్రను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**కొడవలూరు, (రాజధాని వార్తలు):** ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆలోచనతోనే విపిఆర్ ట్రస్ట్ ద్వారా విపి ఆర్ ఉచిత నేత్ర వైద్య శిబిరం ఉదయగిరిలో ప్రారంభం అయి ఇప్పుడు కోవూరు నియోజకవర్గంలో కంటి శిబిరం జరుగుతుంది అని దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. సోమవారం కొడవలూరు మండములో జరుగుతున్న విపిఆర్ శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే 30 వేల మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశామని అవసరం అయిన వారికి ఉచిత కంటి ఆపరేషన్‌లను చేయిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలోని తొలుత విడవలూరు మండలములో మొదలు పెట్టి ఇప్పుడు కొడవలూరు మండలముకు చేరుకొందని అన్నారు. ప్రజల ఆరోగ్యం కొరకే విపిఆర్ నేత్ర ఏర్పాట్లు చేశామని అన్నారు. సేవ చెయ్యడానికే రాజకీయాల్లో వచ్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు. బద్దిపూడి సూర్య, మందిపాటి ప్రవీణ్ కుమార్ రెడ్డి, జీవిఎన్ శేఖర్ రెడ్డి, స్థానిక టీడీపీ నేతలు నాశం ప్రసాద్, కార్యకర్తలు కంటి వైద్యం నిపుణులు తదితరులు ఉన్నారు.



# సంపాదకీయం

## ప్రశ్నించడం నేరమా! ప్రశ్నలు లేని ప్రజాస్వామ్యం ఇది

గత దశాబ్ద కాలంగా ప్రశ్నించడమే ఒక నేరంగా మారిపోయింది. ప్రజలకు అత్యవసరమైన సమాచారాన్ని వరుస ప్రభుత్వాలు అందుబాటులోకి తేవడం లేదు. పౌరులు జ్ఞానాన్వేషణలో భాగంగా ప్రశ్నలు అడిగితే, దానిని ఒక నేరంగా పరిగణిస్తున్నారు. ఎన్నో చట్టాలు ఉన్నాయి–కానీ అవి కేవలం నామమాత్రమే. పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, అత్యున్నత పాలనా ప్రమాణాలను పాటిస్తూ, సమాచార హక్కు చట్టాన్ని తీసుకువచ్చామని వారు చెప్పుకుంటారు; కానీ మరోవైపు, తమకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని పంచుకున్న వారిని, సమాచార సాంకేతిక చట్టాన్ని సాకుగా చూపి అరెస్టు చేస్తారు. ప్రత్యామ్నాయంగా, ప్రభుత్వాలు అటువంటి వ్యక్తులను లేదా సంస్థలను వివిధ రకాల బలవంతానికి గురిచేస్తాయి. అదే సమయంలో, ప్రభుత్వ నాయకులు తమకు అనుకూలంగా ఉండే సాంప్రదాయ మీడియా సంస్థలకు, సోషల్ మీడియా వేదికలకు మాత్రమే–అన్ని సమయాల్లో, అన్ని పరిస్థితుల్లో–ప్రవేశం కల్పిస్తారు. తమ అభిప్రాయాలకు విరుద్ధమైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తారని భావించే వారికి, ప్రభుత్వాలు అధికారిక సమాచారాన్ని కూడా అందుబాటులో ఉంచడానికి నిరాకరిస్తాయి. ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు పత్రికా సమావేశాలను అనుమతించరు. వారు కేవలం కొంతమంది మీడియా వ్యక్తులను మాత్రమే అనుమతిస్తారు. మన దేశంలోని పరిస్థితిని "పేరుకు గొప్ప, కానీ చేతల్లో డొల్ల" అనే సామెత చక్కగా వర్ణిస్తుంది. పేరుకు మనం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం; అయినా, మనం ప్రశ్నలు అడగనివ్వం. ఈ రాష్ట్రంలో గానీ, ఈ దేశంలో గానీ, లేదా విదేశాల్లో గానీ ప్రశ్నలు లేవనెత్తిన వారెవరికీ మనం స్పందించం. ఇటీవల, ప్రధానమంత్రి నాలుగో అధికారిక పర్యటన సందర్భంగా, ఇరు దేశాల నాయకులు నిర్వహించిన సంయుక్త పత్రికా సమావేశంలో, హేల్లె లింగ్ అనే జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నలకు ప్రధానమంత్రి మోదీ సమాధానం చెప్పకుండానే వెళ్ళిపోయారు. ప్రధానమంత్రిగా తన పదేళ్ల పదవీకాలంలో ఆయన ఒక్క పత్రికా సమావేశం కూడా నిర్వహించకపోవడంపై ఎడిటర్స్ గిల్డ్ కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ధోరణి వివిధ రాష్ట్రాల్లో కూడా స్పష్టంగా కనిపిస్తోంది. యువత యథాతథ స్థితిని ప్రశ్నించడం ప్రారంభిస్తే, వారు ఈ పరిస్థితిని ఏమాత్రం సహించరనడానికి ఇటీవలి ఒక సంఘటన నిదర్శనంగా నిలిచింది. యువత గురించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలతో ప్రేరణ పొంది ఒక కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. ఇది డిజిటల్‌కు ప్రాధాన్యతనిచ్చే పార్టీ అయినప్పటికీ, దానికి లభించిన అఖండ స్పందన దేశంలోని ప్రతి రాజకీయ పార్టీని ఒక్క క్షణం ఆగి సమీక్షించుకునేలా చేసింది. తమిళనాడులో ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు యువత ఆలోచనా విధానం ఎంత వేగంగా మారుతోందో ఇప్పటికే సూచించగా, ఈ సాహసోపేతమైన కొత్త పార్టీ ఇప్పుడు స్థిరపడిన రాజకీయ వర్గాలకు ఒక సరికొత్త సవాలు విసరడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది. సమకాలీన రాజకీయాల గురించి తాము లేవనెత్తిన సంబంధిత ప్రశ్నలకు సమాధానాలు లభించనంత వరకు, ప్రస్తుత రాజకీయ పార్టీలను అధికార పగ్గాలకు చాలా దూరంగా ఉంచడానికి యువత వెనుకాడదనేది ఒక స్పష్టమైన ధోరణి సూచిస్తోంది. పెరుగుతున్న అవినీతి, అభద్రత, నిరుద్యోగం వంటివి ప్రస్తుత రాజకీయ వ్యవస్థ పట్ల యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ఆజ్యం పోస్తున్నాయి. వాస్తవం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది: ఎన్నికలను పట్టిపీడిస్తున్న అవకతవకలు, అన్యాయాలను; ఈ సమస్యలపై రాజకీయ పార్టీల మౌనాన్ని; వాటిని అరికట్టడానికి రూపొందించిన చట్టాలు ఉన్నప్పటికీ కొనసాగుతున్న విచ్చలవిడి పార్టీ ఫిరాయింపులు, అంతర్గత తిరుగుబాట్లను యువత నిరవధికంగా సహించదు, లేదా నిష్క్రియ ప్రేక్షకులుగా ఉండిపోదు. విచారకరంగా, ఆ చట్టాలు అమలు కాకుండానే మిగిలిపోయాయి.

## "మెగా డీఎస్సీ కాదు...కూటమి ప్రభుత్వ దగా డీఎస్సీ" నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సిరమ్మ

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు చేసిన వంచనలకు నిరసనగా వైఎస్ఆర్సిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కేకే రాజు మరియు యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో విశాఖపట్నంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. వీరితో పాటు మాజీ మంత్రి పి.బాల రాజు, వాసుపల్లి గణేష్ కుమార్ మాజీ ఎమ్మెల్యే, శాసనమండలి సభ్యుడు కే హరిబాబు, శాసనమండలి సభ్యురాలు మరియు రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి, విశాఖ జిల్లా మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణి, విజయనగరం జిల్లా చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ, విశాఖ జిల్లా సాంస్కృత విభాగం అధ్యక్షులు వంకాయల మారుతి ప్రసాద్ తదితరులు ఉన్నారు. మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువత ఆశలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ జిల్లా పరిషత్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆదేశాల మేరకు వారి కుమార్తె మజ్జి సిరి సహస్ర (సిరమ్మ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

# బీవీసీకి జాతీయ స్థాయి సస్టైనబుల్ క్యాంపస్ ఇంపాక్ట్ అవార్డు

## - పురస్కారం అందుకున్న చైర్‌పర్సన్ డాక్టర్ బోనం కనకదుర్గ




**అల్లవరం, (రాజధాని వార్తలు):** పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి, హరిత క్యాంపస్ నిర్మాణం, పునరుత్పాదక శక్తి వినియోగం, వ్యర్థాల నిర్వహణ వంటి రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు బోనం వెంకట చలమయ్య ఇంజినీరింగ్ కళాశాల (బీవీసీ), ఓడలరేవుకు ప్రతిష్ఠాత్మకమైన "సస్టైన బుల్ క్యాంపస్ ఇంపాక్ట్ అవార్డు–2026" లభించింది. హైదరాబాద్‌లో రిసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "భారత్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ – సస్టైనబుల్ క్యాంపస్ ఇంపాక్ట్ సమ్మిట్ & అవార్డ్స్–2026" కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ బోనం కనకదుర్గ సోమవారం ఈ అవార్డును అందుకున్నారు. దేశవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి, గ్రీన్ క్యాంపస్ నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యాసంస్థలకు ఈ అవార్డులను ప్రదానం చేశారని కనకదుర్గ తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ డాక్టర్ బోనం కనకదుర్గ మాట్లాడుతూ, "సుస్థిర అభివృద్ధి అనేది భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యతని విద్యార్థులలో పర్యావరణ స్పృహ కలిగిన బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడం బీవీసీ లక్ష్యమన్నారు. ఈ అవార్డు మా సంస్థ సమిష్టి కృషికి లభించిన జాతీయ గుర్తింపు అన్నారు. ఈ విలువలు వారసత్వంగా అందించిన సెక్రెటరి బోనం కనకయ్యకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. భారత్ సస్టైనబిలిటీ క్యాంపస్ మిషన్–2026లో భాగంగా బీవీసీ కళాశాల పర్యావరణ అవగాహన కార్యక్రమాలు, సస్టైనబిలిటీ ప్రతిజ్ఞ, జీరో ప్లాస్టిక్ డ్రైవ్, వ్యర్థాల నిర్వహణ శిక్షణ కార్యక్రమాలు, గ్రీన్ ఆడిట్ వంటి అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిందన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు పెద్దఎత్తున పాల్గొని పర్యావరణ పరిరక్షణ పట్ల తమ బాధ్యతను చాటి చెప్పారని కనకదుర్గ అన్నారు. ఇటీవల నిర్వహించిన గ్రీన్ ఆడిట్‌లో కళాశాల ప్రాంగణంలో 4,876 చెట్లు, విస్తృత హరితావరణం, వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు, మురుగునీటి శుద్ధి కేంద్రం, బయోగ్యాస్ ఉత్పత్తి, సౌరశక్తి వినియోగం వంటి అంశాలు విశేష గుర్తింపు పొందాయని కళాశాల విద్యుత్ అవసరాలలో 55 శాతానికి పైగా పునరుత్పాదక శక్తి వనరుల ద్వారానే సమకూరుతుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని ఆమె తెలిపారు. ఈ జాతీయ స్థాయి సమ్మిట్‌కు విద్యా, శాస్త్ర, పారిశ్రామిక మరియు పర్యావరణ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారాం, మాజీ డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి, ప్రజాస్వామ్య సంస్కరణల ఉద్యమకారుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూ అనంతపురం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన రావు, ఈపీటీఆర్ఐకి చెందిన రాజేశ్వర్ జొన్నలగడ్డ, ఎన్ఐఆర్డీపీఆర్ విభాగాధిపతి డాక్టర్ రవీంద్ర గవాలి, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ఎం.కృష్ణమూర్తి, ఐబీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనూరాధ. ఎ. సెంటిఫిక్ వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రభ వడ్లమాని, అమరరాజా గ్రూప్ చీఫ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ ప్రశాంత్ తివారీ, తదితర ప్రముఖులు పాల్గొన్నారు. కళాశాలకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల కళాశాల అధినేత బోనం కనకయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.ఎన్.ఎస్. ఆర్.రత్నాకరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రవీణ్, కార్యనిర్వహణాధికారి ఏ వి ఆర్ వి ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఎన్ ఎస్ఎస్ కో ఆర్డినేటర్స్ బృందం సలాది తాతయ్య నాయుడు, ఇ.ఎస్.వి.సుబ్రహ్మణ్యం, జి.లోవరాజులనూ పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

# జెఈఈ అడ్వాన్స్‌లో ఆల్ ఇండియా 217వ ర్యాంక్ సాధించిన శ్రీరామ్



**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ మండలం కరప గ్రామానికి చెందిన విద్యార్థి చింతా సత్య శ్రీరామ్ జెఈఈ అడ్వాన్స్ పరీక్షలో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 217వ ర్యాంక్ సాధించి గ్రామానికి, జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. శ్రీరామ్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు, ప్రస్తుతం కాజులూరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న చింతా నారాయణమూర్తి, పార్వతి దంపతులు కుమారుడు. చిన్నప్పటి నుంచే విద్యపై ఆసక్తి కనబరిచిన శ్రీరామ్, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో, పట్టుదలతో నిరంతరం శ్రమించి ఈ అరుదైన విజయాన్ని సొంతం చేసుకున్నాడు. జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన జెఈఈ అడ్వాన్స్ పరీక్షలో అత్యుత్తమ ర్యాంక్ సాధించడం ద్వారా తన ప్రతిభను చాటుకున్న శ్రీరామ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీరామ్‌ను ఆయన తల్లి పార్వతి, తాతయ్య సత్యనారాయణ, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రజలు, విద్యావేత్తలు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు శ్రీరామ్ ఆదర్శంగా నిలిచారని వారు పేర్కొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధిపై ఉన్న పట్టుదల అంకితభావం అభినందనీయం

## - మున్సిపాలిటీలో వాటర్, డ్రైన్లు, రోడ్ల అభివృద్ధికి రూ. 2.50 కోట్లతో ఎర్ర వంతెన - నల్ల వంతెన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన - పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ







**అమలాపురం, (రాజధాని వార్తలు):** అమలాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలనే పట్టుదల, నిరంతర తపన శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావులో స్పష్టంగా కనిపిస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ కొనియాడారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు సమగ్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, అందులో భాగంగానే అమలాపురం మున్సిపాలిటీ పరిధిలో రూ. 2.50 కోట్ల సాధారణ నిధులతో ఎర్ర వంతెన నుంచి నల్లవంతెన వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపల్ పార్కు వద్ద నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' నెల రోజుల పారిశుద్ధ్య కార్యక్రమాన్ని మంత్రి నారాయణ పరిశీలించి కాలువలో పూడికతీత పనులను స్వయంగా ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తహసిల్దార్ కార్యాలయం వద్ద ప్లాస్టిక్ రహిత బయో–డీగ్రేడబుల్ టీ కప్పులను ఆయన ఆవిష్కరించారు. తడి–పొడి చెత్తను బూడిదగా మార్చే అత్యాధునిక ప్లాస్మా టెక్నాలజీ యూనిట్‌ను పరిశీలించారు. ఎమ్మెల్యే ఆనందరావు నాయకత్వంలో అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తూ అమలా పురాన్ని రాష్ట్రంలోనే ఒక మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా మంత్రి నారాయణ పిలుపునిచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణ బాబు ఇంటి వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాబోయే రోజుల్లో అమలాపురం మున్సి పాలిటీ పరిధిలో తాగునీరు (వాటర్), డ్రైనేజీలు, రోడ్లను మరింతగా అభివృద్ధి చేసి ప్రజలకు అందు బాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ అమలాపురం నియోజకవర్గ ప్రగతిపై ఎమ్మెల్యే ఆనందరావుకు ఉన్న స్పష్టమైన విజన్‌ను, ప్రజా సమస్యల పట్ల ఉన్న తపనను అభినందించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి సమస్యనూ తన దృష్టికి తీసుకువస్తూ, నిధుల మంజూరుకు ఆయన చూపిస్తున్న చొరవ ప్రశంసనీయమన్నారు. అమలాపురం మున్సిపాలిటీ పరిధిలో ఏ ఒక్క అభివృద్ధి పని ఆగిపోవడానికి వీల్లేదనీ ఎమ్మెల్యే ఆనందరావు నియోజకవర్గ ప్రగతి కోసం ఏ అభివృద్ధి పని అడిగినా ఎన్ని నిధులు కావాలన్నా వాటన్నింటినీ వెంటనే మంజూరు చేసి ప్రతి పనినీ నేనే దగ్గరుండి పూర్తి చేసి పెడతానని బహిరంగంగా హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రగతికి అహర్నిశలు శ్రమించే ఎమ్మెల్యే లభించడం అమలాపురం నియోజకవర్గ ప్రజల అదృష్టమని మంత్రి పి.నారాయణ కొనియాడారు. ఆనందరావు మాట్లాడుతూ నియోజకవర్గానికి విచ్చేసి ఇక్కడి అభివృద్ధిలో భాగస్వాములైనందుకు, అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ హరీష్ బాలయోగి, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆర్డీఓ మాధురి, తహసీల్దార్ దివాకర్, మున్సిపల్ కమిషనర్ వి. నిర్మల్ కుమార్, స్థానిక వార్డు సభ్యులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, పురపాలక సంఘ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇది మెగా డీఎస్సీ కాదు దగా డీఎస్సీ

## - అమలాపురంలో మెగా డీఎస్సీ పై వైఎస్ఆర్సిపి నిరసన - వైస్సార్సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన - జిల్లా కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు చేసిన విద్యార్థి నాయకులు



**అమలాపురం, (రాజధాని వార్తలు):** చంద్రబాబు ప్రభుత్వం విద్యార్థులను మెగా డీఎస్సీ పేరుతో తీవ్రంగా మోసం చేసిందని ఇది మెగా డీఎస్సీ కాదని ఇది దగా డీఎస్సీ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరసన చేపట్టింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో అమలాపురంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో అర్హుల ఎంపిక ప్రక్రియలో చోటు చేసుకున్న అవకతవ కలు, అక్రమాలు, పారదర్శ కత లేమితో నిరుద్యోగ యువతలో తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత, ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు కల్పించాల్సిన ప్రభుత్వం నియామక ప్రక్రియను వివాదాస్పదం చేసి వేలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందని మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగ యువత జీవితాలతో ఆటలా డుకుంటుందని నియామకాలలో జరిగిన అవకతవకలు ఇందుకు నిదర్శనమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ధ్వజమెత్తాయి. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ రావు, బొమ్మి ఇజ్రాయిల్, అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ, గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఒంటెద్దు వెంకన్న నాయుడు, వైస్సార్సీపీ నాయకులు కుడుపూడి భరత్ భూషణ్, సంసాని బుల్లి నాని, రాజుల పూడి మురళి, చింతా రామకృష్ణ, విత్తనాల ఇంద్ర శేఖర్, విత్తనాలమూర్తి, విద్యార్థి సంఘ విభాగాల నాయకులు, వైసీపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనారు.

# పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలి

**గూడూరు టౌన్, (రాజధాని వార్తలు):** భారతీయ జనతా పార్టీ కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విస్తృతం చేయాలని గూడూరు నగర మండల పార్టీ అధ్యక్షులు కే దయాకర్ సూచించారు. పార్టీ ఆదేశాల మేరకు జూన్ నెలలో చేయాల్సిన పార్టీ కార్యక్రమాలపై కార్యాలయంలో నగర మండల పార్టీ అధ్యక్షులు దయాకర్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ప్రతినెల ఒకటవ తేదీ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఈనెల 5వ తేదీన ఇందిరానగర్‌లో అమ్మ పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడానికి అందరూ తప్పసరిగా రావాలని ఎస్ఐ ఆర్‌పై అవగాహన కార్యక్రమం, బి ఎల్ ఓ 2 బూత్ లెవల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. మన ఊరు మన జెండా కార్యక్రమంలో అర్బన్ మండలంలో 25 జండాలను అన్ని వార్డుల్లో ప్రజా సమూహము ఉండే చోట జెండా రచ్చ ఏర్పాటు చేసి, జెండాను ఎగరవేయాలని, శక్తి కేంద్రాలలో, మండల కమిటీ సభ్యుల ఇళ్ల పైన, అదేవిధంగా భూత అధ్యక్షులు, మోర్చా అధ్యక్షులు కార్యకర్తలు గృహములపైన అర్బన్ మండలంలో సుమారు 100 జెండాలు ఏర్పాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా బిజెపి ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆరికట్ల బాలకృష్ణ నాయుడు, మండల ఉపాధ్యక్షులు ఐ సురేష్ బాబు, గుంజి శ్రీనివాసరావు, జీవీ నాయుడు, మహిళా మోర్చా అధ్యక్షురాలు వేమా బాలామణి, దాసరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శులు పర్చూరు బాలకృష్ణ గౌడ్, ఎం రవీంద్రబాబు, ఓబీసీ అధ్యక్షులు కటకాల సురేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు దట్టం మధుసూదన్, ప్రసాద్, ఎస్ వాసనాయుడు, చంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

## విట్టయ్యపాలెంలో వైభవంగా శ్రీశ్రీశ్రీ అంకాలమ్మ తల్లి తిరనాళ్ళు

**వరదయ్యపాలెం, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలంలోని విఠయ్యపాలెం గ్రామంలో అంకాలమ్మ తిరనాళ్ళను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో గ్రామ నడి బొడ్డున వెలసిన శ్రీ పోలేరమ్మ తల్లి రూపమైన వేప చెట్టుకి, ఎంతో మహిమ గల మహాలక్ష్మమ్మకు మేళా తాళలతో, డప్పుల చప్పుళ్లతో, ఆట పాటలతో ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా బాణాసంచా కాలుస్తూ ఆబాల గోపాలం పసుపు కుంకుమలతో, చీర సారేలు తీసుకుని అంబళ్లు ఎత్తుకుని ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించి నైవేద్యం సమర్పించారు. తదుపరి సాయంత్రం ఊరికి ఎగువ బాగానా కొలువున్న ఎంతో మహిమ శక్తి గల గ్రామదేవత (వేప చెట్టు) అంక్కమ్మ తల్లికి పొంగల్లు పొట్టేలు సమర్పించి ఆ దేవతకు మొక్కలు చెల్లించుకున్నారు.


# శివకార్తికేయన్‌తో చిత్రాలు.. నిర్మాతకు అన్ని కష్టాలా?



కోలీవుడ్ సినీ ఇండస్ట్రీలో ప్రముఖ నిర్మాతగా గుర్తింపు పొందిన కోటపాడి జె. రాజేష్ (కేజేఆర్ రాజేష్) రీసెంట్‌గా తన ఆర్థిక పరిస్థితుల గురించి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. హీరో, డాక్టర్, అయలాన్ వంటి చిత్రాలను నిర్మించిన ఆయన.. శివకార్తికేయన్‌తో చేసిన ప్రాజెక్టుల కారణంగా యాదృచ్ఛికంగా ఎదుర్కొన్న ఆర్థిక ఒత్తిడిని షేర్ చేసుకున్నారు. కేజేఆర్ స్టూడియోస్ బ్యానర్ పై వరుసగా భారీ చిత్రాలను నిర్మించిన రాజేష్.. 2018లో హీరో, అదే సమయంలో అయలాన్ చిత్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఆ సమయంలో మూడు సినిమాలకు సంబంధించిన ఇన్వెస్ట్మెంట్లు, లోన్లు తిరిగి చెల్లించాల్సిన పరిస్థితి ఉందేదని చెప్పారు. 2019 నాటికే ఫైనాన్షియల్ ట్రాన్సక్షన్స్ కంప్లీట్ అవుతాయని భావించినప్పటికీ, పరిస్థితులు అనుకున్నట్లు సాగలేదని పేర్కొన్నారు. శివకార్తికేయన్‌తో మూడు సినిమాల ఒప్పందం చేసుకున్న సమయంలో ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన లోన్లు తానే భరిస్తానని హామీ ఇచ్చినట్లు రాజేష్ వెల్లడించారు. 2019లో విడుదలైన హీరో సినిమా తర్వాత దాదాపు రూ.30 కోట్ల మేర ఫైనాన్సియల్ ప్రెజర్ ఏర్పడిందని తెలిపారు. అయితే అదే సమయంలో కరోనా మహమ్మారి రావడంతో ఇండస్ట్రీ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంది. కరోనా కారణంగా షూటింగ్స్ నిలిచిపోవడం, విడుదల వాయిదా పడటం, ఫైనాన్సియల్ సోర్సెస్ తగ్గిపోవడం వంటి పరిణామాలు నిర్మాతలపై ప్రభావం చూపించాయి. ముఖ్యంగా అయలాన్ వంటి భారీ విజువల్ ఎఫెక్ట్స్ బేస్డ్ సినిమా పూర్తవడానికి ఎక్కువ సమయం పట్టడంతో ఖర్చు మరింత పెరిగిందని రాజేష్ వివరించారు. డాక్టర్, అయలాన్ చిత్రాల ప్రొడక్షన్ టైమ్‌లో మూడేళ్ల పాటు వడ్డీ భారం గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన సమయంలో తనపై ఉన్న అప్పులు సుమారు రూ.90 కోట్లు కాగా, ప్రస్తుతం అవి దాదాపు రూ.120 కోట్లకు చేరుకున్నాయని ఆయన వెల్లడించారు.

పెరిగిన అప్పులు తన పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్ పై ఎఫెక్ట్ చూపాయని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆ ప్రాజెక్టుల వల్ల శివకార్తికేయన్ కు కూడా సుమారు రూ.55 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు రాజేష్ చెప్పారు. అయితే అన్ని ఇబ్బందుల మధ్య కూడా శివకార్తికేయన్‌తో తన రిలేషన్ కొనసాగుతోందని రాజేష్ క్లారిటీ ఇచ్చారు. తమ మధ్య ఇంకా రెండు సినిమాల కమిట్మెంట్ మిగిలి ఉందని, ఆ చిత్రాలు ఎప్పుడు స్టార్ట్ అవుతాయో దేవుడికే తెలుసని వ్యాఖ్యానించారు. నిర్మాతగా అరమ్, హీరో, డాక్టర్, అయలాన్ వంటి చిత్రాలతో గుర్తింపు పొందిన కేజేఆర్ రాజేష్ జర్నీ విజయాలతో పాటు ఆర్థిక సవాళ్లతో నిండిపోయిందని ఆయన కామెంట్స్ ద్వారా క్లియర్‌గా తెలుస్తోంది. భారీ చిత్రాల నిర్మాణంలో ఉండే రిస్క్, పాండమిక్ సిట్యువేషన్స్, పెరిగిన వడ్డీ భారం వంటి ఎలిమెంట్స్ నిర్మాతలపై ఎంత ఎఫెక్ట్ చూపిస్తాయో రాజేష్ అనుభవం చెప్పకనే చెబుతోంది.

# భార్య అడిగిన ప్రశ్న మాధవన్ జీవితాన్నే మార్చేసిందట!



సినీ పరిశ్రమలో స్టార్‌డమ్, గ్లామర్, విజయాలు ఎంత వేగంగా వస్తాయో, పర్సనల్ లైఫ్‌లో సంబంధాలు అంతే వేగంగా దెబ్బతినే సందర్భాలు కూడా కనిపిస్తుంటాయి. కానీ కొన్ని జంటలు మాత్రం కాలానికి అతీతంగా నిలిచి ప్రేమ, గౌరవం, నమ్మకానికి నిర్వచనంగా మారుతాయి. అలాంటి అరుదైన జంటల్లో మాధవన్, ఆయన భార్య సరిత బిర్జే ఒకరు. 56వ పుట్టినరోజు జరుపుకుంటున్న మాధవన్ గురించి అభిమానులు గ్రీన్ ఫ్లాగ్ హీరో అని చెప్పడానికి కారణం ఆయన సినిమాలు మాత్రమే కాదు, ఆయన తన వైవాహిక జీవితాన్ని నడిపించిన తీరు కూడా. 1991లో కొల్హాపూర్‌లో పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాసులు నిర్వహిస్తున్న టైమ్‌లో సరితతో మాధవన్‌కు పరిచయం ఏర్పడింది. అప్పట్లో ఎయిర్ హోస్టెస్ కావాలనే లక్ష్యంతో ఉన్న సరిత, మాధవన్ వద్ద ట్రైనింగ్ తీసుకున్నారు. టీచర్- స్టూడెంట్ బాండింగ్ దూరం పాటించిన మాధవన్, ఆమె జాబ్ వచ్చిన తర్వాత కృతజ్ఞతగా ఇచ్చిన డిన్నర్ ఆహ్వానాన్ని స్వీకరించారు. అదే డిన్నర్ ఇద్దరి జీవితాలను మార్చేసింది. ఎనిమిదేళ్ల ప్రేమ తర్వాత 1999లో పెళ్లి చేసుకున్న ఈ జంట, నేటికీ అన్యోన్య దాంపత్యానికి ప్రతీకగా నిలుస్తోంది. తమ బంధం బలంగా నిలవడానికి కారణం ప్రేమ కంటే ఎక్కువగా పరస్పర గౌరవమేనని మాధవన్ అనేక సందర్భాల్లో చెప్పారు. సరితకు తాను స్టార్ కాదని, తనతో ప్రేమలో పడిన వ్యక్తిని మాత్రమేనని, ఆమెను సమాన భాగస్వామిగా చూస్తానని ఆయన చెప్పిన మాటలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. భార్యను ప్రత్యేకంగా భావించడమే కాకుండా, తన లైఫ్‌లో వచ్చిన ప్రతి సక్సెస్‌కు ఆమెనే కారణమని బహిరంగంగానే చెబుతుంటారు. మాధవన్ పర్సనల్ లైఫ్‌లో మరో కీలక మలుపు డైరెక్టర్ మణిరత్నం ఇచ్చిన సలహాతో వచ్చింది. షూటింగ్స్ టైమ్‌లో ఫ్యామిలీకి దూరంగా ఉండటం రిలేషన్స్‌ను దెబ్బతీయవచ్చని సూచించిన మణిరత్నం మాటలను ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. అప్పటి నుంచి సాధ్యమైనంత వరకు సరితను తనతో పాటూ షూటింగ్‌లకు తీసుకెళ్లేవారట. గ్లామర్ ప్రపంచంలో ఎదురయ్యే ఆకర్షణలకు దూరంగా ఉండటమే కాకుండా, దాంపత్య బంధాన్ని మరింత బలపర్చడంలో ఆ నిర్ణయం కీలక పాత్ర పోషించిందని మాధవన్ చెప్తుంటారు. అయితే మాధవన్ జీవితాన్ని నిజంగా మార్చింది సరిత అడిగిన ఒక ప్రశ్న అని చెప్పాలి. ఒక దశలో వర్క్ పై తన దృక్పథం మారిపోయిందని గమనించిన ఆమె, నీకు ఏమైందని ప్రశ్నించిందని, నువ్వు పని చేయడానికి వెళ్లడం కాదు, అక్కడి నుంచి తిరిగి రావడానికి వెళ్తున్నట్టు కనిపిస్తున్నావని చెప్పిన ఆ మాటలు తనను లోతుగా ఆలోచింపజేశాయని మాధవన్ వెల్లడించారు. ఆ ఇన్సిడెంట్ తర్వాతే ఆయన కెరీర్, వ్యక్తిగత జీవితంలో సమతుల్యత గురించి మరింత శ్రద్ధ పెట్టారని పేర్కొన్నారు. నటుడిగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మాధవన్, కుటుంబానికి కూడా అంతే ప్రాధాన్యం ఇచ్చారు. 2005లో జన్మించిన కుమారుడు వేదాంత్ ఈరోజు భారతదేశానికి పతకాలు సాధిస్తున్న ఈతగాడిగా ఎదగడం వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది.

స్టార్ హీరోగా విజయాలు సాధించిన మాధవన్, తండ్రిగా, భర్తగా కూడా ఆదర్శంగా నిలవగలిగారు. గ్లామర్ ప్రపంచంలో అనేక సంబంధాలు కాలపరీక్షలో విఫలమవుతున్న తరుణంలో, 33 ఏళ్ల పరిచయం, 27 ఏళ్ల వివాహ బంధాన్ని ప్రేమతో, గౌరవంతో కొనసాగిస్తున్న మాధవన్ కథ మాత్రం చాలా ప్రత్యేకంగా నిలుస్తోంది. అందుకే అభిమానులు ఆయనను కేవలం రొమాంటిక్ హీరోగానే కాకుండా, రియల్ లైఫ్‌లోనూ గ్రీన్ ఫారెస్ట్‌గా అభివర్ణిస్తున్నారు.

# ఈవెంట్లో కళ్లన్నీ జాన్వీ కట్టుకున్న చీరపైనే.. నెట్టింట ఒకటే ఆరాలు!



మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ నటించిన మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా మూవీ పెద్ది విజయవాడ ఈవెంట్ బంపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. వేలాది మంది మెగా ఫ్యాన్స్ సమక్షంలో జరిగిన ఈ భారీ ఈవెంట్‌లో చిత్ర కథానాయిక జాన్వీ కపూర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యంగా వేడుకలో అందరి కళ్లూ ఈ కుర్ర బ్యూటీ కట్టుకున్న అందమైన చీరపైనే.. విజయవాడ ఈవెంట్ కోసం జాన్వీ కట్టుకున్న ఆ చీర ఖరీదు ఎంత? ఆ స్పెషల్ డిజైనర్ చీరను ఎవరు డిజైన్ చేసి ఉంటారు? అన్న ఆరాలే సోషల్ మీడియాలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. జాన్వీ కపూర్ ఈ ఈవెంట్ కోసం ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా కలెక్షన్ నుండి ఎంచుకున్న ఒక లగ్జరియస్ చాక్లెట్ బ్రౌన్ కలర్ శారీని ధరించారు. ఈ చీరను షీర్ నెట్..జార్జెట్ ఫ్యాబ్రిక్‌తో ఎంతో అద్భుతంగా రూపొందించారు. చీర బోర్డర్ అంతటా కొన్ని ప్రదేశాలలో సాంప్రదాయ మోటిఫ్స్‌తో కూడిన హెవీ ఎంబ్రాయిడరీ.. సీక్విన్స్ (మెరిసే పూసలు) - జరి వర్క్‌తో చాలా రిచ్‌గా డిజైన్ చేసారు. అలాగే చీర బాడీ అంతటా చిన్న చిన్న సీక్విన్ ఛమ్కీలు మెరుస్తూ మోడ్రన్ స్టైల్ గ్లామర్‌ను అద్దాయి. ఈ చీరకు మరింత రాయల్ లుక్ తీసుకొచ్చేలా బ్రౌన్ కలర్ హై-నెక్ (క్లోజ్డ్ నెక్) బ్లౌజ్ ధరించిన తీరు హృదయాలను హత్తుకుంది. బ్లౌజ్ మెడ భాగంలో.. చేతులపై చీర బోర్డర్‌కు మ్యాచ్ అయ్యేలా ఎంబ్రాయిడరీ వర్క్ హైలైట్. ఈ క్లాసిక్ ఎత్నిక్ లుక్‌కు తగ్గట్టుగా హెవీ గోల్డెన్ స్టేట్‌మెంట్ జుంకాలు, మ్యాచింగ్ గాజులు.. వింటేజ్ రింగ్స్ జాన్వీ అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. సాంప్రదాయంలోని హుందాతనాన్ని, మోడ్రన్ స్టైల్‌ను బ్యాలెన్స్ చేస్తూ ఈ డిజైన్ పెద్ది వంటి భారీ సినిమా ఈవెంట్స్‌కు పర్ఫెక్ట్ ఛాయిస్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏది ఏమైనా ఈవెంట్లో కళ్లన్నీ జాన్వీపైనే! ఈ వేడుకలో జాన్వీ కపూర్ మాట్లాడుతూ.. ప్రేక్షకులు తనపై చూపిస్తున్న ప్రేమ, ఆదరణపై ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. రామ్ చరణ్‌తో కలిసి నటించే అవకాశం రావడం తన అదృష్టమని.. అతడు అద్భుతమైన నటుడు..గొప్ప వ్యక్తి అని కొనియాడారు. దర్శకుడు బుచ్చిబాబు అత్యంత ప్యాషనేట్ డైరెక్టర్ అని... రెహమాన్ ఒక లెజెండ్ అని ప్రశంసించారు. పెద్ది ఒక గ్రాండ్ థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అని...ఈ సినిమా తర్వాత తనకు మరింత గుర్తింపు పెరుగుతుందని జాన్వీ నమ్మకాన్ని వ్యక్తం చేసారు. జూన్ 4న ఈ స్పెషల్ సినిమాను బిగ్ స్క్రీన్‌పై ఆస్వాదించాలని కోరారు.

# '4 రోజుల్లో రూ.4 కోట్ల వసూళ్లు?'.. పోస్టర్లపై అర్జున్ సర్జా అభిప్రాయమేంటి?



యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా చేసిన లేటెస్ట్ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం సినిమా విడుదలైన వెంటనే భారీ వసూళ్ల పోస్టర్లు విడుదల చేయడం సాధారణంగా మారిన నేపథ్యంలో.. అలాంటి ప్రమోషన్స్ పై తన అభిప్రాయాన్ని అర్జున్ సర్జా క్లియర్‌గా వెల్లడించారు. ప్రస్తుతం ఆయన కామెంట్స్.. నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. అర్జున్ సర్జా కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం, నిర్మాణ బాధ్యతలు చేపట్టిన చిత్రం సీతాపయనం. లవ్, ఫ్యామిలీ రిలేషన్స్, ఇండియన్ కల్చర్, సనాతన ధర్మం వంటి ఎలిమెంట్స్‌తో రూపొందిన ఆ చిత్రం ఫిబ్రవరి 14వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాతోనే అర్జున్ సర్జా కూతురు ఐశ్వర్య అర్జున్ తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్‌గా పరిచయమయ్యారు. రీసెంట్‌గా సినిమా మార్కెటింగ్ విషయంలో తనకు ఎదురైన ఓ అనుభవాన్ని పంచుకున్నారు అర్జున్ సర్జా. "సీతాపయనం విడుదల సమయంలో ఒక మార్కెటింగ్ ఏజెన్సీ నాలుగు రోజుల్లో రూ.4 కోట్ల వసూళ్లు వచ్చినట్లు పోస్టర్ విడుదల చేద్దామని సూచించింది. నాకు అసలు అంత డబ్బులు రావు. అందుకే ఒప్పుకోలేదు నేను. చల్ రే అంటూ రిజెక్ట్ చేశా" అంటూ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం బాక్సాఫీస్ నెంబర్స్ విషయంలో ఫేక్ ప్రచారం జరుగుతుందనే అభిప్రాయం ఎప్పటికప్పుడు తరచూ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో అర్జున్ చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. సినిమా వసూళ్ల కంటే ప్రేక్షకుల రెస్పాన్స్ ముఖ్యమని ఆయన భావిస్తున్నట్లు వ్యాఖ్యల ద్వారా క్లారిటీ వచ్చింది. ఇక సీతాపయనంలో కన్నడ నటుడు నిరంజన్ సుధీంద్ర హీరోగా నటించగా, ఐశ్వర్య అర్జున్ సీత పాత్రలో కనిపించింది. అర్జున్ సర్జాతో పాటు ఆయన అల్లుడు ధృవ సర్జా కూడా గెస్ట్ రోల్‌లో సందడి చేశారు. ప్రకాష్ రాజ్, సత్యరాజ్, కోవై సరళ, సుమిత్ర, బిత్తిరి సత్తి కీలక పాత్రలు పోషించారు. సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ స్వరాలు అందించగా, రచయిత సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. కథ విషయానికి వస్తే, ప్రమాదం నుంచి బయటపడిన సీత తనను రక్షించిన వారికి థ్యాంక్స్ చెప్పేందుకు ప్రయాణం ప్రారంభిస్తుంది. ఆ సమయంలో అభి అనే యువకుడితో పరిచయం ప్రేమగా మారుతుంది. అయితే అతడు దాచిన ఒక నిజం బయటపడిన తర్వాత సీత తీసుకున్న నిర్ణయం చుట్టూ కథ సాగుతుంది. సినిమాలో ఫ్యామిలీ వాల్యూస్, హ్యూమన్ రిలేషన్స్, గోసంరక్షణ, సనాతన ధర్మం వంటి విషయాలకు ఇంపార్టెన్స్ ఇచ్చారు. కానీ కమర్షియల్ ఎలిమెంట్స్ తక్కువగా ఉండటం, కథలో కొత్తదనం లేకపోవడం, స్లో స్క్రీన్‌ప్లే వంటి కారణాలతో ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. ఏదేమైనా సినిమాకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిక్స్ డ్ రెస్పాన్స్ వచ్చింది. అయినా సరే, ఒరిజినల్ కలెక్షన్లకే ఇంపార్టెన్స్ ఇవ్వాలని, ఫేక్ ప్రమోషన్స్ ద్వారా సక్సెస్ చూపించే ప్రయత్నాలు చేయకూడదని అర్జున్ సర్జా ఇన్ డైరెక్ట్ గా చేసిన కామెంట్స్ ఆకట్టుకుంటున్నాయి. అంతే కాదు అప్పుడప్పుడు వస్తున్నట్లు కొందరు భావిస్తున్న ఫేక్ పోస్టర్ల మధ్య ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీస్తున్నాయి.



# "చినకాద"లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

## - మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ "శిరిపూరి"

**దత్తిరాజేరు, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** మండలంలోని చినకాద గ్రామంలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం పండగ వాతావరణంలో జరిగింది. రాష్ట్ర ఎం.ఎస్.ఎమ్.ఈ, సెర్ప్, ఎన్.ఆర్.ఐ వ్యవహారాల శాఖామాత్యులు కొండపల్లి శ్రీనివాస్ సూచనల మేరకు గ్రామంలో కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగిందని మండల టిడిపి పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శిరిపూరి నారాయణ మూర్తి రాజు విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నారాయణ మూర్తి రాజు మాట్లాడుతూ గ్రామంలో గల రేషన్ డిపో వద్ద కొత్తగా మంజూరైన ఎనిమిది రేషన్ కార్డులను గ్రామ పార్టీ నాయకులతో కలిసి పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు పల్ల రమేష్, గ్రామ పార్టీ అధ్య క్షుడు బైరెడ్డి గణేష్, మాజీ వైస్ ప్రెసిడెంట్ ధూళి సూర్యారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# ఉద్యోగ విరమణ గావించిన ఆడిట్ అధికారి పెంటపాటి సీతారామమూర్తి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా పని చేసిన పెంటపాటి సీతారామమూర్తి ఉద్యోగ విరమణ గావించారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ వేడుకలకు ఉత్తరాంధ్ర స్థాయిలో అనేకమంది అధికారులు ఉద్యోగులు విచ్చేసి పెంటపాటి సీతారామమూర్తి, సత్యవాణి దంపతులను అభినందించారు. 1990 జనవరి 23వ తేదీన హైదరాబాదులో స్టేట్ ఆడిట్ డిపార్ట్మెంట్లో టైపిస్టుగా ప్రస్థానాన్ని ప్రారంభించిన సీతారామమూర్తి 36 సంవత్సరాలు పాటు అవిశ్రాంతంగా సేవలు అందించారు. 1993 అక్టోబర్ 21వ తేదీన విజయనగరం జిల్లా ఆడిట్ డిపార్ట్మెంట్లో జూనియర్ ఆడిటర్‌గా విజయనగరం జిల్లాలో అడుగు పెట్టారు. 1995 అక్టోబర్ 11వ తేదీన సీనియర్ ఆడిటర్‌గా పదోన్నతి లభించింది. 2002లో సీనియర్ ఆడిటర్‌గా శ్రీకాకుళంకు బదిలీ అయ్యారు. 2004లో స్పెషల్ సెల్లో ఆడిటర్‌గా బాధ్యతలు స్వీకరించి తిరిగి మరోసారి విజయనగరంలో అడుగు పెట్టారు. 2013లో సింహాచలంలో అసిస్టెంట్ ఆడిటర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2019 ఫిబ్రవరి నుండి విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా సేవలు కొనసాగించారు. విశ్రాంత ఆడిట్ అధికారి కంచర్ల రాజేశ్వరరావు, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ లోకేష్ తదితరులు పెంటపాటి సీతారామమూర్తి దంపతులను అభినందించారు.

# జూన్ నుంచి 5,606 కొత్త స్పౌజ్ పెన్షన్లు

## - గింజేరుతో తాతయ్య అనుబంధం ఇప్పటికీ గుర్తుంది - గ్రామంలో 1.11 కోట్లతో తాగునీటి సమస్య పరిష్కారం - గింజేరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్







**గంట్యాడ, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** ఈ జూన్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 5606 స్పౌజ్ పెన్షన్లు కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు తెలిపారు. సోమవారం గజపతినగరం నియోజకవర్గం గంట్యాడ మండలం గింజేరులో మంత్రితో పాటు కూటమి నాయకులు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకురాలు బగ్గు అర్చన కూడా పాల్గొని పెన్షన్లు పంపిణీ చేశారు. గ్రామానికి చేరుకున్న మంత్రికి గ్రామస్తులు మేళతాళాలతో పాటు ఎదురేగి స్వాగతం పలికి హారతులు పట్టి ఘనంగా గ్రామంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి పలువురు అవ్వ- తాతలకు పెన్షన్ ఇస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి స్వయంగా అవ్వతాతల వద్దకు వచ్చి వారి గురించి అడగడంతో చాలా మంది మురిసిపోయారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 62,34,445 మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని... జూన్ నెలలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు రు. 2728 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. కొత్తగా జూన్ నుంచి 5606 స్పౌజ్ పెన్షన్లు మంజూరు చేశామని.. ఈ లబ్ధిదారులకు ప్రత్యేకంగా 2.24 కోట్లు విడుదల చేసినట్టు మంత్రి చెప్పారు. ఇక కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు పెన్షన్ల కోసం రికార్డు స్థాయిలో రూ. 65,886.57 కోట్లు విడుదల చేశామన్నారు.

**గింజేరుకు తాతయ్యతో ఎంతో అనుబంధం :**

గింజేరు గ్రామం రావడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని.. ఈ గ్రామం గంట్యాడకు సమీపానే ఉండడం, తాతయ్య పైడితల్లి నాయుడికి ఎంతో అనుబంధం ఉండడం తనకు గుర్తు ఉందని మంత్రి తెలిపారు. తాతయ్య గ్రామంలో ప్రతి ఒక్కరిని పేరు పెట్టి పిలవడం తాను మర్చిపోలేనన్నారు. నాన్న గారు కొండపల్లి కొండబాబు ఎంపీపీగా ఉన్నప్పుడు గ్రామంలో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించి గ్రామం ప్రశాంతంగా ఉండేలా చేశారని చెప్పారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి 1.11 కోట్లు మంజూరయ్యాయని.. పంచాయతీ బిల్డింగ్‌కు రు. 33 లక్షలు, సీసీ రహదారులకు రు. 90 లక్షలు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. బగ్గు అర్చన మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసేందుకు గింజేరు గ్రామానికి వచ్చిన తమకు గ్రామస్తులు స్వచ్ఛమైన కల్మషం లేని మనస్సులతో స్వాగతం పలకడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# అర్జీదారు సంతృప్తి చెందని, రీ ఓపెన్ అయిన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

## - జనగణన గడువు పెంపు : జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్





**విజయనగరం, (రాజధాని వార్తలు):** పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలలో సంతృప్తిచెందని, రీఓపెన్ అయిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా, మండల అధికారులతో సమావేశం నిర్వహించి పిజిఆర్ఎస్, రెవిన్యూ క్లినిక్, ప్రజా సానుకూల సర్వే, జనగణన, స్వర్ణవార్డు, స్వర్ణ గ్రామ కార్యాలయాల తనిఖీ, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ సేధు మాధవన్ మాట్లాడుతూ పిజిఆర్ ఎస్ కార్యక్రమంలో ప్రజలు అందజేసిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 24 గంటలగడువులో 11 అర్జీలు, 48 గంటల గడువులో 13 అర్జీలు, 72 గంటల గడువులో 31 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. సంతృప్తి చెందని, రిఓపెన్ అయిన అర్జీదారులతో అధికారులు స్వయంగా మాట్లాడి సమస్య గురించి తెలుసుకొని పరిష్కారం చేయాలని, వారు సంతృప్తి చెందేలా వివరణ ఇవ్వాలన్నారు. అర్జీదారులతో మర్యాదగా మాట్లాడాలని, సరియైన ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు అర్జీల పరిష్కారంపై పర్యవేక్షణ చేయాలని తెలిపారు. అర్జీల సత్వర పరిష్కారానికి ప్రతి శాఖకు సంబంధించిన అర్జీలను సంబంధిత జిల్లా అధికారికి పంపించాలని వారి ద్వారా క్షేత్రస్థాయి అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. వాట్సాప్ గవర్నర్‌ను ప్రతి పౌరుడు వినియోగించుకునేలా స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని, సేవలు వినియోగించుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రజల్లో సంతృప్త స్థాయిలు పెరిగేటట్లు అధికారులు కృషిచేయాలని ఆదేశించారు. పాజిటివ్ పర్సెప్షన్‌లో శాఖలు యెక్క పనితీరు సంతృప్తి స్థాయి 90 శాతానికి పెరిగేందుకు కృషి చేయాలన్నారు.

జిల్లాలో జనగణన గడువు 7 రోజులు పొడిగించడం జరిగిందని, 19 మండలాలు, 468 గ్రామాలలో అంచనాలకు తక్కువగా జనాభా నమోదు జరిగిందని, ఆ మం డలాలు, గ్రామాలలో గతంలో నిర్వహించిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేతో సరిపోల్చి, అన్ని కుటుంబ వివరాలు నమోదుచేసి నివేదికలు సరిచేయాలన్నారు. 2011 జనగణన వివరాలు ప్రామాణికంగా తీసుకొని, వివరాలు సేకరించాలని తెలిపారు. 2011 జనాభా లెక్కల కంటే 16% అభివృద్ధి అంచనా వేయడం జరి గిందని, ఏ గ్రామంలోనైనా జనాభా నిశ్చిత, తరుగుదల ఉంటే అందుకు కారణాలను తెలియజేస్తూ నివేదిక అందజేయాలన్నారు. నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు ప్రతి వారంలో నాలుగు స్వర్ణ వార్డు గ్రామ కార్యాలయాలు తనిఖీ చేయాలని ఆదేశించారు. లక్ష్యం మేరకు తనిఖీలు తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ సత్తిబాబు, కె ఆర్ ఆర్ సి ఎస్.డి.సి. మురళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాలు : రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్









**గజపతినగరం, విజయనగరం, (రాజధాని వార్తలు):** పరిశ్రమల స్థాపన, మనుగడకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పించి జిల్లాలోని పారిశ్రామిక పార్కులను తీర్చిదిద్దాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారతా సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఆయన ముందుగా బొండపల్లి మండలం కొండకిండాంలో నిర్మితమవుతున్న ఎంఎస్ఎంఈ పార్కును సందర్శించారు. అక్కడి పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాన్‌లో కొద్దిపాటి మార్పులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు బి.వి ప్రభుజి, గజపతినగరం నియోజకవర్గ జనసేన నాయకులు మర్రపు సురేష్, తాసిల్దార్ డోల రాజేశ్వరరావు, సీ.ఐ ఎస్.సన్యాసినాయుడు, ఎస్సై యు.మహేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజయనగరంలోని తమ క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని పారిశ్రామిక పార్కుల పరిస్థితి, ఎంఎస్ఎంఈ పార్కుల పురోగతిపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. విటి అగ్రహారం, నెల్లిమర్ల, కంటకాపల్లి, బొబ్బిలి పారిశ్రామిక పార్కుల వారీగా ప్రస్తుతం నడుస్తున్న యూనిట్లు, అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. విటి అగ్రహారం పార్కులో విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, నెల్లిమర్ల పార్కులో విద్యుత్ ఓల్టేజ్ సమస్య, అప్రోచ్ రోడ్డును విస్తరణ, కంటకాపల్లి పార్కుకు రహదారి, బొబ్బిలి పార్కులో ఓల్టేజి సమస్య, మూతపడ్డ పరిశ్రమలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధిలో ఇండస్ట్రియల్ పార్కులు, ఎంఎస్ఎంఈ పార్కులు ఎంతో కీలకమన్నారు. వీటి ద్వారానే ఎక్కువ మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. భారీ పరిశ్రమలతో పాటు చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత నిస్తోందని చెప్పారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటు కావాలంటే, పారిశ్రామిక పార్కుల్లో తగిన వసతులు ఉండాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రహదారులు, విద్యుత్, కాలువలు, డ్రైన్లు తగిన వసతులను కల్పించాలని సూచించారు. జిల్లాలోని నాలుగు పారిశ్రామిక పార్కులను పరిశీలించి సమగ్ర నివేదికను తయారు చేయాలని ఆదేశించారు. చెత్తను ప్రాసెసింగ్ చేసే పరిశ్రమలన్నీ ఒకే చోట ఏర్పాటు చేస్తే, క్లష్టర్‌గా ఏర్పాటు చేస్తామని చెప్పారు. మామిడి పళ్లను ఎక్కువ రోజులు నిల్వ ఉండేవిధంగా ఒక ప్రత్యేక పద్ధతిలో ప్రాసెసింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేసేందుకు భోగాపురం ప్రాంతంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఒక యూనిట్ ఏర్పాటు కానుందని వెల్లడించారు. పిపిపి విధానంలో జిల్లా పరిశ్రమల కేంద్రం కార్యాలయాల నిర్మాణానికి ప్రభుత్వం ఒక కొత్త పాలసీని రూపొందిస్తోందని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కరుణాకర్, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ వి.కృష్ణప్రసాద్, జెఇఇ రాజేష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రియల్ పార్కుల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అనకాపల్లి జిల్లాలో 2,52,328, మందికి రూ.107.56 కోట్లు విడుదల

### - ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్









**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలో ప్రతి లబ్దిదారునికి ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్లు సక్రమంగా అందేలా పంపిణీ పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ ఆదేశిం చారు. సోమవారం నక్కపల్లి, అద్దాల వీధిలో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని లబ్దిదారుల ఇంటికి వెళ్లి పించన్లు అందించారు. నేత పనివార్లకు మహిళలకు, వితంతులకు, వృద్ధులకు పింఛన్లను కలెక్టర్ స్వయంగా పంపిణీ చేశారు. పింఛన్లు పంపిణీ విధానంపై ఆరా తీసి సక్రమంగా సకాలంలో అందుతున్నది, లేనిది లబ్ధిదారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో జరుగుతున్న పింఛన్లు పంపిణీ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం 2,52, 328 మంది లబ్ధిదారులకు రూ.107,56,39,500/- పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధి అలాగే 24 గ్రామీణ మండలాల్లో ఉదయం 5 గంటల నుంచే లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. శత శాతం పెన్షన్లు పంపిణీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

### - ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్









**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలోని పీజీఆర్ఎస్ అర్జీల ను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత గడువులోగా పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ మందిరంలో ప్రజా గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు డిఆర్ఓ వై.సత్యనారా యణరావు, డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మిలతో కలసి అనకాపల్లి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల నుంచి వినతు లను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిం చరాదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా రెవిన్యూ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యుత్, తాగునీరు తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన అర్జీలను కేవలం సమస్యలను పరిష్కరించడమే ముఖ్యం కాదని, ఫిర్యాదుదా రుడు సంతృప్తి చెందేలా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండకూడదని, గడువు ముగియక ముందే సంబంధిత అధికా రులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖలో నిర్వహి స్తున్న పిజిఆర్ఎస్ అమలు పనితీరుని శాఖల వారిగా కలెక్టర్ సమీక్షించారు.

ఈ-ఆఫీస్ తప్పనిసరిగా అమలు చేయాలని, సిబ్బంది అందరికి లాగిన్ ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వాట్సాప్ గవర్నన్స్‌పై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఫిర్యాదులను తిరస్కరించాల్సి వస్తే, దానికి సరైన కారణాలను తెలియజేస్తూ ఫిర్యాదుదారునికి లిఖితపూర్వక సమాచారం ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల కు ఇబ్బందులు కలగకుండా శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పెండింగ్ అర్జీలు అధికంగా ఉన్న శాఖల అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేస్తూ, సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ రైల్వే జోన్ ఏర్పాట్లుకు గ్రీన్ సిగ్నల్‌పై మాజీ సర్పంచ్ సమాధి శ్రీనివాసులు హర్షం



**విడవలూరు, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాట్లుతో ఈ ప్రాంతములో అభివృద్ధికి నూతన ఒరవడి ఏర్పడనున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చౌకచర్ల మాజీ సర్పంచ్ సాగునీటి ఉపాధ్యక్షలు సమాధి శ్రీనివాసులు కృతజ్ఞతలను, పీఎం మోదీకి, సీఎం చంద్రబాబు నాయుడు కు తెలిపారు. ఎన్నో ఏళ్ల కళ సాకారం అయిందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రధాన మంత్రి మోదీ చొరవతో నురైల్వే మంత్రి కృషితో రైల్వే జోన్ ఏర్పాట్లు చెయ్యడం తాము అందరూ హర్షిస్తున్నట్లు చెప్పారు. చరిత్రలో ఇంతవరకు ఎవరు సాధించిలేని పక్రియను సీఎం చంద్రబాబు కృషితో కేంద్రం గ్రీన్ సిగ్నల్స్ ఇవ్వడం గొప్ప పరిణామని అన్నారు. ఏపీలో రైల్వే జోన్ విశాఖ పట్నంకు రావడం అందరికి గర్వకారణమని శ్రీనివాసులు అన్నారు.

# టీడీపీతోనే సుస్థిర పాలన

### - ఎన్టీఆర్ ఫలితమే పార్టీకి వయసు 44 ఏళ్లు - వెల్లువెత్తిన ఎన్టీఆర్ జయంతి, మహానాడులు, జయప్రదం : విడవలూరు టీడీపీ మాజీ అధ్యక్షులు చేవూరు రాంప్రసాద్ నాయుడు






**విడవలూరు, (రాజధాని వార్తలు):** దివంగత నేత మాజీ సీఎం ఎన్టీఆర్ టీడీపీ స్థాపించి 44 ఏళ్ళు అయిందని. ఆనాడు రామారావు టీడీపీ ప్రభుత్వంలో ఎన్నో పేదలకు సంక్షేమ ఫలాలు ఇచ్చి ఉమ్మడి రాష్ట్ర అభ్యున్నతికి ఎనలేని కృషి చేసి టీడీపీ పార్టీని బలోపేతం చేసినందున సుస్థిర పాలన సాధ్యం అయిందని విడవలూరు మండలం సీనియర్ నేత మాజీ మండలం అధ్యక్షులు చేవూరు రాంప్రసాద్ నాయుడు అన్నారు. ఎన్టీఆర్ జయంతి రోజున రెండో రోజు వర్చువల్ మహానాడు వాడవాడలా విజయవంతం చేసారని. అదేరోజు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులు అర్పించి మహానేతను స్మరించుకొన్నారని అన్నారు. పార్టీ అధినేత, సీఎం నారా చంద్రబాబు నాయుడు. నాయకత్వంలో మంగళగిరిలో మహా నాడు సూపర్ సక్సెస్ అయిందని అన్నారు. నెల్లూరు జిల్లాలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి క్లస్టర్‌ల ప్రాంతాలలోను, అదేవిధంగా కోవూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పరిధిలో ఉన్న క్లస్టర్‌లలో హైబ్రిడ్ వర్చువల్ మహానాడులను విజయవంతం చెయ్యడములో వేమిరెడ్డి పుణ్యదంపతులు కీలక పాత్ర పోషించిరని రామ్ ప్రసాద్ కొనియాడారు. ప్రతి మాసము ఎన్టీఆర్ భరోసా పింఛనలను ప్రతి మాసములో 1న ఇంటి ఇంటికి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆదేశాలు మేరకు బాధితులకు పంపిణీ జరగడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు అన్నారు. గత ప్రభుత్వం కంటే అన్ని రంగాల్లో సీఎం చంద్రబాబు నాయుడు మెరుగైన పాలన అందిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కోవూరు నియోజకవర్గం ప్రతి నిత్యం ప్రజలు కొరకే పని చేస్తూ టీడీపీ పార్టీని బలోపేతం చెయ్యడములో కృషి చెయ్యడం తామందరికి సంతోషంగా ఉందని చెప్పారు. పార్టీలకు కులాలకు అతీతంగా ఎమ్మెల్యే ప్రశాంతి కృషి ఎనలేనిదని అన్నారు. బాధితుల పట్ల వెంటనే స్పందిస్తూ సమస్యలు పరిస్థితిని అర్థం చేసుకొని వెంటనే పరిష్కారం దిశగా నియోజకవర్గం నునడిపిస్తున్న ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఇలాంటి మహిళా ఎమ్మెల్యే కోవూరుకు ఉండడం కోవూరు నియోజకవర్గం ప్రజలు చేసుకొన్న అదృష్టంగా భావిస్తున్నారని రాంప్రసాద్ అన్నారు.

# వాకాడ పాఠశాలలో విద్యార్థుల నమోదు కార్యక్రమం విజయవంతం





**వాకాడ, (రాజధాని వార్తలు):** వాకాడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు (ఎన్‌రోల్‌మెంట్) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారులు పాల్గొని విద్యార్థుల చేరికలను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మండల విద్యా శాఖ అధికారులు కె.బుల్లి కృష్ణవేణి, పి. సత్యనారాయణ, ఏఎల్ఎస్‌సీఓ వై.రాంబాబు, ప్రధానోపాధ్యాయుడు శీలం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, వేములవాడ సహకార సంఘం చైర్‌పర్సన్ దూడల నారాయుడు, కామిరెడ్డి సురేష్, పలివెల సోమరాజు, గుత్తుల ఈశ్వరరావు, గుత్తుల లక్ష్మణరావు, బొండాడ వెంకట సుబ్బారావు, లకమాన నారయ్య తదితరులు కార్యక్రమానికి హాజరై తమ మద్దతు తెలిపారు. ఈ నమోదు కార్యక్రమం ద్వారా ఏడుగురు విద్యార్థులు పాఠశాలలో కొత్తగా చేరినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకరించిన ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

# కార్మికులందరినీ కాపాడి తన ప్రాణాలు పోగొట్టుకున్న అపాచీ బస్సు డ్రైవర్

**తడ, (రాజధాని వార్తలు):** తడ మండలంలోని అపాచీ కంపెనీ బస్సు, కార్మికులని విధులు అనంతరం తీసుకెళుతున్న బస్సు, అకస్మాత్తుగా బస్సు టైరు పేలడంతో బస్సు అదుపు తప్పడంతో, డ్రైవరు అప్రమత్తమై బస్సులోని కార్మికులను కాపాడాలని, బస్సును చాకచక్యంగా పక్కనే ఉన్న హై వోల్టేజ్ విద్యుత్ స్తంభాన్ని తప్పించి, ప్రక్కన గోడకు గుద్దుకోవడం వల్ల బస్సులోని ప్రయాణికులు అందరూ సురక్షితంగా బయటపడ్డారు. కానీ డ్రైవర్ మాత్రం అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సులోని కార్మికులందరూ మా ప్రాణాలను కాపాడి తను ప్రాణాలను తీసుకున్నాడని బోరున విలపించారు. కార్మికుల ప్రాణాలు కాపాడిన బస్సు డ్రైవర్ కుటుంబాన్ని కంపెనీ యాజమాన్యం ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు. ఇకనుండి అయినా కంపెనీ యాజమాన్యాలు వాహనాల నిర్వహణకు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call

## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎల్రైటానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

## RAJADHANIVARTALU.COM
## 9440662699


# జూన్ 3 నుంచి 5 వరకు మూడు రోజుల పాటు కేరళంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పర్యటన

**- కేరళం పర్యటనకు బయల్దేరిన మంత్రి కందుల దుర్గేష్..'బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్'గా నిలిచిన ఏపీ - ఎంపికైన నేపథ్యంలో జూన్ 4న జీటీఎం ఎక్స్ పో -2026లో ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకోనున్న మంత్రి దుర్గేష్ - సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దార్శనికతకు దక్కిన అరుదైన గౌరవంగా అభివర్ణించిన మంత్రి దుర్గేష్ - కూటమి ప్రభుత్వ పర్యాటక సంస్కరణలకు జాతీయ గుర్తింపు రావడంపై హర్షం.. 'బ్రాండ్ ఏపీ'కి దక్కిన అరుదైన పురస్కారంగా అభివర్ణన - నూతన టూరిజం పాలసీ, పారిశ్రామిక హోదాతో మారిన గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌పై అదరగొట్టిన 'బ్రాండ్ ఏపీ'.. కూటమి ప్రభుత్వంలో మారిన ఆంధ్రప్రదేశ్ పర్యాటక ముఖచిత్రం: మంత్రి దుర్గేష్ - కేరళం అవార్డు ఏపీ పర్యాటక వైభవ ప్రపంచ స్థాయి విజయాలకు ఒక ఘనమైన ఆరంభంగా పేర్కొన్న మంత్రి కందుల దుర్గేష్**

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. దక్షిణాదిలోనే అతిపెద్ద ట్రావెల్ అండ్ ట్రేడ్ ఎక్స్‌పో అయిన 'గ్లోబల్ ట్రావెల్ మార్కెట్' (జిటిఎం 2026) ఆంధ్రప్రదేశ్‌ను "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్" (ఉత్తమ పర్యాటక ప్రచార రాష్ట్రం) గా ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో కేరళలోని తిరువనంతపురంలో జరగనున్న 'జీటీఎం ఎక్స్ పో -2026'లో పాల్గొని, ప్రతిష్ఠాత్మకమైన 'మెట్రో ఎక్స్‌పెడిషన్ - జిటిఎం టూరిజం అవార్డు 2026' ను స్వీకరించేందుకు రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మూడు రోజుల కేరళం పర్యటనకు బయలుదేరారు. కేరళం పర్యటనలో భాగంగా జూన్ 3న తిరువనంతపురంలోని కోవాలం 'ఉదయ్ సముద్ర లీజర్ బీచ్ హోటల్ అండ్ స్పా'లో జరిగే జీటీఎం ఎక్స్ పో -2026 ప్రారంభోత్సవంలో మంత్రి దుర్గేష్ పాల్గొంటారు. అనంతరం జూన్ 4న తిరువనంతపురం 'గోల్డెన్ ప్యాలెస్ కన్వెన్షన్ సెంటర్'లో జరిగే ఎక్స్ పో కార్యక్రమాలకు హాజరవుతారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు కోవాలంలోని 'లీలా తిరువనంతపురం రావిజ్ హోటల్'లో జరిగే జీటీఎం అవార్డ్స్-2026 వేడుకలో దేశవిదేశాల ప్రముఖుల సమక్షంలో ఏపీకి దక్కిన "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్" అవార్డును మంత్రి దుర్గేష్ అందుకోనున్నారు. ఆ తర్వాత జూన్ 5న తిరువనంతపురం నుండి ముంబయి పర్యటనకు బయలుదేరి వెళ్తారు.



**ఇది కూటమి ప్రభుత్వ దార్శనికతకు దక్కిన గౌరవం: మంత్రి కందుల దుర్గేష్**

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. "ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల దిశానిర్దేశంలో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి కాట, పర్యాటక శాఖ అధికారుల బృందం అంతర్జాతీయ స్థాయిలో చేసిన కృషికి దక్కిన అరుదైన గౌరవం ఇది. పర్యాటక రంగంలో మేం తీసుకొచ్చిన వినూత్న సంస్కరణలు, విప్లవాత్మక మార్పుల వల్లే ఈ రోజు జాతీయ స్థాయి ప్రశంసలు దక్కాయి" అన్నారు. ప్రధానంగా నూతన పర్యాటక పాలసీ 2024-29, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పన, అనుబంధ పాలసీలు అదే విధంగా 'బ్రాండ్ ఏపీ' ప్రదర్శనతో సోషల్ మీడియా, అంతర్జాతీయ ప్లాట్‌ఫామ్స్‌పై ఏపీ పర్యాటక సౌందర్యాన్ని సరికొత్త శైలిలో బ్రాండింగ్ చేశామన్నారు. రాష్ట్రంలో టూరిజం యాక్టివిటీ పెంచేందుకు ఏడాది పొడవునా నిరంతరం ప్రతి జిల్లాలో పర్యాటక ఉత్సవాలు నిర్వహించామన్నారు. అంతేగాక సృజనాత్మక ఆలోచనలు, డిజిటల్ ప్రమోషన్స్ ద్వారా అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించామన్నారు. కేరళంలో అందుకోబోయే ఈ జాతీయ అవార్డు ఏపీ పర్యాటక వైభవానికి ముగింపు కాదు.. ఇది ప్రపంచ స్థాయి విజయాలకు ఒక ఘనమైన ఆరంభం!" అని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టూరిజం బోర్డులు, హాస్పిటాలిటీ బ్రాండ్‌లు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొనే ఈ ఎక్స్‌పో ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి మరిన్ని పెట్టుబడులు, పర్యాటకులు వచ్చే అవకాశం ఉందని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# దేశ ప్రగతికి ఆరోగ్య సంరక్షణే కేంద్ర బిందువు : గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్

**- డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 29వ, 30వ సంయుక్త స్నాతకోత్సవాలకు అధ్యక్షత వహించిన గవర్నర్**







**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఆరోగ్య సంరక్షణ దేశ ప్రగతికి కేంద్ర బిందువుగా మారిందని, నాణ్యమైన, అందుబాటులో ఉండే, అందరికీ సమానంగా చేరువయ్యే వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో దేశం ముందుకు సాగుతోందని రాష్ట్ర గవర్నర్, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం కులపతి జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 29వ, 30వ సంయుక్త స్నాతకోత్సవాలకు ఆయన అధ్యక్షత వహించి స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. వైద్య విద్య, ఆరోగ్య మౌలిక వసతుల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్య విద్య, ఆరోగ్య మౌలిక వసతులు, ప్రజారోగ్య సేవల విస్తరణ ద్వారా ఈ లక్ష్య సాధనకు కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. వైద్య రంగానికి విశిష్ట సేవలను యూనివర్సిటీ అందించిందన్నారు.. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైద్య, ఆరోగ్య విజ్ఞాన విద్యలో విశిష్టమైన వారసత్వాన్ని నిర్మించుకుందని, వైద్యులు, దంతవైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు, ఫిజియోథెరపిస్టులు మరియు అనుబంధ ఆరోగ్య నిపుణులను తీర్చిదిద్దుతూ దేశ విదేశాల్లో ఆరోగ్య సేవల బలోపేతానికి దోహదపడిందని గవర్నర్ కొనియాడారు. విద్యార్థులు ప్రజాసేవ, మానవ గౌరవ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసిన డాక్టర్ ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించాలని సూచించారు. డీఎండీసీ కేంద్రం ఏర్పాటు అభినందనీయం అని అన్నారు. విశ్వ విద్యాలయంలో సమీకృత వ్యాధి పర్యవేక్షణ కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన "డిసీజ్ మోడలింగ్ అండ్ డెసిషన్ ఇంటెలిజెన్స్ సెంటర్"ను గవర్నర్ అభినందించారు.

జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారంతో వ్యాధుల అంచనా, విశ్లేషణ, నిర్ణయాల రూపకల్పనలో నిపుణులను తీర్చి దిద్దే ఈ కేంద్రం శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు యోగా, ధ్యానం సాధన చేయాలని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించాలని, తగిన విశ్రాంతి, నిద్రకు ప్రాధాన్యత ఇవ్వాలని గవర్నర్ సూచించారు. శారీరక, మానసిక ఒత్తిడిని అధిగమించి, జీవితాంతం నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. 29వ స్నాతకోత్సవ ముఖ్య అతిథి, హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రుల అరిథ్మియా మరియు ఎలక్ట్రోఫిజియాలజీ సేవల డైరెక్టర్ డాక్టర్ సి.నరసింహన్‌కు గౌరవ డాక్టర్ ఆఫ్ సైన్స్ (డి.ఎస్‌సి.) పట్టా ప్రదానం చేశారు. 30వ స్నాతకోత్సవంలో హైదరాబాద్ అపోలో ఆసుపత్రుల కార్డియాక్ సైన్సెస్ విభాగం డైరెక్టర్, హెచ్‌వోడీ డాక్టర్ పి.సి.రాత్‌కు గౌరవ డాక్టర్ ఆఫ్ సైన్స్ (డి.ఎస్‌సి.) పట్టా ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ యూనివర్సిటీ వార్షిక నివేదికను సమర్పించి విద్య, పరిశోధన, సాంకేతికత, విద్యార్థుల సంక్షేమ రంగాల్లో సాధించిన పురోగతిని వివరించారు. అనంతరం ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను జ్ఞాపికతో సత్కరించారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan